

నేడు ఇసుక టెండర్ల స్క్రూట్నీ

రాజమహేంద్రవరం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఇటీవల వంగలపూడి-1, వంగలపూడి-2, జీడిగుంట ఓపెన్ ర్యాంపులకు టెండర్లు పిలవగా 37 దరఖాస్తులు వచ్చిన సంగతి విధితమే. వీటిని శుక్రవారం అధికారులు తెరిచారు. వాటిని శనివారం స్క్రూట్నీ చేయనున్నారు. సోమవారం నాటికి వీటిని ఖరారు చేస్తామని మైన్స్ ఏడీ ఫణిభూషణ్‌రెడ్డి తెలిపారు.



పల్లెలు..డిజిటల్!

ప్రపంచం అంతా మారిపోయింది.. డిజిటల్ వైపు పరుగులు పెడుతోంది.. ప్రస్తుతం రూపాయి చెల్లించాలన్నా ఆన్‌లైన్.. అయితే పంచాయతీల్లో మాత్రం ఇప్పటి కింకా పాత పద్ధతే. ఏ సేవ కావాలన్నా మాన్యువల్‌గా దరఖాస్తు చేయాల్సిందే.. వాళ్లూ అదే స్థాయిలో మాన్యువల్‌గా ధ్రువీకరణ పత్రం అందజేస్తారు. ఈ విధానానికి స్వస్తి పలకాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. దీనిలో భాగంగా డిజిటలైజేషన్ దిశగా అడుగులు వేస్తోంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 1103 పంచాయతీలు ఉండగా అన్నింటా ఈ సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఈ నేపథ్యంలో ఇక ఏ సేవ అయినా ఆన్‌లైన్‌లోనే. దీంతో గ్రామీణ ప్రజల కష్టాలు తీరనున్నాయి.. ఈ సేవలు జనవరి నుంచి అమల్లోకి వస్తాయి.

ఇక పంచాయతీల్లో సేవలన్నీ ఆన్‌లైన్

- జనవరి నుంచి డిజిటలైజేషన్
- జిల్లాలో 1103 పంచాయతీలు
- స్వర్ణ పంచాయతీల్లో అమలు
- ప్రజలకు వేగంగా సేవలు
- ఆన్‌లైన్‌లోనే ధ్రువీకరణపత్రాలు
- ఎక్కడి నుంచైనా పన్నుల చెల్లింపు
- మారనున్న పంచాయతీ పాలన
- కార్యదర్శులకు డిజిటల్ కీ
- త్వరగా సర్టిఫికెట్ల జారీ

కార్పొరేషన్(కాకినాడ)/మండపేట, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): పంచాయతీల్లో ఇకపై డిజిటల్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. ప్రజలకు వేగంగా, పారదర్శకంగా ప్రభుత్వ సేవలు అందనున్నాయి. జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు కావాలంటే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేస్తే చాలు రెండు, మూడు రోజుల్లోనే జారీ కానున్నాయి. ఆన్‌లైన్‌లోనే ఆస్తిపన్ను చెల్లించొచ్చు.. వ్యాపార లైసెన్సులు పొందొచ్చు..వీటికి సంబంధించి కార్యదర్శులకు డిజిటల్ కీ అందుబాటులోకి రానుంది.దీంతో ఏ ధ్రువీకరణ పత్రం కావాలన్నా ఆన్‌లైన్‌క్లియర్‌గా ఉండనుంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని 62 మండలాలు 1103 పంచాయతీలున్నాయి.అన్ని పంచాయతీల్లో కొత్త విధానాన్ని అమలు చేయనున్నారు. పంచాయతీలు జారీ చేసే వివిధ ధ్రువీకరణ పత్రాలకు నిరీక్షించాల్సిన అవసరంలేదు. సులభంగా సర్టిఫికెట్లు పొందేలా రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ కొత్తవిధానానికి శ్రీకారం చుట్టింది. మీసేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకుంటే వాటిని కార్యదర్శులు పరిశీలించి డిజిటల్ సంతకాలు చేస్తారు. అనంతరం మీసేవ నుంచి సర్టిఫికెట్లు తీసుకునేలా చర్యలు చేపట్టారు.

కొత్త విధానం ఇలా..

పంచాయతీల ద్వారా జనన,మరణ ధ్రువీకరణ పత్రాలను మాన్యువల్ పద్ధతిలోనే జారీ చేస్తున్నారు. కొత్త విధానంలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వెంటనే అందులో నమోదు చేసిన ఫోన్ నెంబర్‌కి దరఖాస్తు సంఖ్య మెసేజ్ రూపంలో వస్తుంది. పత్రం సిద్ధం కాగానే దరఖాస్తుదారుడి ఫోన్ నెంబర్‌కు మెసేజ్ రూపంలో సమాచారం అందుతుంది.కొత్త విధానం అమల్లోకి రావడంతో పంచాయతీలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకుంటే సరిపోతుంది. రెండు, మూడ్రోజుల వ్యవధిలో సర్టిఫికెట్లు పొందే అవకాశం ఉంటుంది.

ఎక్కడి నుంచైనా చెల్లింపులు..

ప్రపంచంలో ఎక్కడ, ఏమూల ఉన్నా మీ సొంత ఊళ్లోని మీ ఇంటికి ఏటా ఆస్తిపన్ను చెల్లించాలంటే ఇక పంచాయతీ వరకు వెళ్లనక్కర్లేదు. ఉన్నచోటు నుంచే నేరుగా ఆన్‌లైన్‌లో ఆస్తిపన్ను చెల్లించవచ్చు. జనవరి నుంచి స్వర్ణ పంచాయతీల్లో భాగంగా డిజిటల్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. వ్యాపార లైసెన్సులు, భవన నిర్మాణ అనుమతులు, వివాహ, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు ఇలా పలు సేవలను ఆన్‌లైన్‌లోనే పొందవచ్చు. ఈమేరకు పంచాయతీల్లో పాయింట్ ఆఫ్ సేల్ (పీవోఎస్) పరికరాలు సిద్ధం చేస్తున్నారు. వీటితో డెబిట్, క్రెడిట్ కార్డుల ద్వారా బకాయిలు చెల్లించచ్చు. మరికొన్ని చోట్ల క్యూఆర్ కోడ్ ద్వారా పన్ను బకాయిలు వసూళ్లకు చర్యలు తీసుకుంటున్నారు. ప్రజల నుంచి వసూలు చేసిన మొత్తాలను ఆయా పంచాయతీల పీడీ ఖాతాల్లో జమయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు.

గత ప్రభుత్వం నిర్లక్ష్యం

ప్రజలకు సత్వరం సేవలందించే ఉద్దేశంతో 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వం డిజిటల్ పంచాయతీలను అభివృద్ధి చేసి ఒక పోర్టల్ తీసుకొచ్చింది. దీని నిర్వహణను అప్పట్లో నేషనల్ ఇన్ఫర్మాటిక్ సెంటర్ (ఎన్ఐ సీ)కి అప్పగించింది. వైసీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక ఎన్ఐసీ నిధులు ఇవ్వకపోవడంతో పోర్టల్ నిర్వహణ మూలనపడింది. దీంతో ఐదేళ్లపాటు పంచాయతీల డిజిటలైజేషన్ మూలన పడింది. కూటమి ప్రభుత్వం స్వర్ణ పంచాయతీ పోర్టల్ నిర్వహణను రాష్ట్ర ఆర్థిక నిర్వహణ, సేవల సంస్థకు అప్పగిస్తోంది.ఈ నేపథ్యంలో జనవరి నుంచి అమల్లోకి రానుంది. ఇక గ్రామీణ ప్రజల కష్టాలు తీరనున్నాయి.

కార్యదర్శుల వివరాలు సేకరణ..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 62 మండలాలు 1103 పంచాయతీలున్నాయి. అన్ని పంచాయతీల్లో కొత్త విధానాన్ని అమలు చేయనున్నారు.మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శుల డిజిటల్ సంతకాలను బయోమెట్రిక్‌తో నమోదు చేశారు. డిజిటల్ టోకెన్లను జారీ చేయడానికి కార్యదర్శుల డిజిటల్ సంతకాలు, వివరాలను కంప్యూటర్ ఆపరేటర్ సేకరించారు. ప్రతి కార్యదర్శికి సంబంధించి సమగ్ర వివరాలను ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌లో పొందుపరుస్తున్నారు. ఇప్పటికే డిజిటల్ సంతకాల సేకరణ పూర్తి కాగా కార్యదర్శులకు డిజిటల్ కీలను జిల్లా ఉన్నత అధికారులు అందజేశారు.



తొలి దశలో ముఖ్యమైన సేవలు

పంచాయతీల్లో తొలిదశలో ముఖ్యమైన సేవలు ఆన్‌లైన్‌లోనే అందించనున్నారు. ఆస్తి విలువ ధ్రువీకరణ పత్రాలు, వ్యాపార లైసెన్సులు జారీ అయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నారు. జనన, మరణ, వివాహ ధ్రువీకరణ పత్రాలు, సూక్ష్మ చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటుకు నిరభ్యంతర ధ్రువీకరణపత్రాలు, భవన నిర్మాణాలకు అనుమతులు ఆన్‌లైన్‌లో అందించనున్నారు. పంచాయతీల్లో అందించే 80 సేవలను క్రమంగా స్వర్ణ పంచాయతీ పోర్టల్లో అందుబాటులో పెట్టనున్నారు. దీంతో గ్రామీణ ప్రజల కష్టాలు తీరనున్నాయి. ఇక ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేస్తే చాలు 80 రకాల సేవలు అందుబాటులోకి వస్తాయి.

మీ భవిష్యత్ మా చేతిలో ఉంది.. బ్యాడ్ కాండక్ట్ అని రాస్తాం!

- డైట్ కళాశాల ప్రిన్సిపాల్ బెదిరింపులు..
- ఆర్‌జేడీ విచారణలో విద్యార్థినుల ఏకరవు

రాజమహేంద్రవరం రూరల్, డిసెంబరు 6 (అంధ్రజ్యోతి) : బొమ్మూరు డైట్ కళాశాలలో విద్యార్థినుల ఫిర్యాదులపై ఆర్‌జేడీ జి.నాగమణి విచారణ చేపట్టారు. విద్యార్థినులపై వేధింపులు, హాస్టల్‌లో సమస్యలు తదితర అంశాలపై డైరెక్టరేట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఆంధ్రప్రదేశ్ ఆదేశాల మేరకు శుక్రవారం ఆమె పరిశీలించారు. అనంతరం సెమినార్ హాల్‌లో కళాశాల ప్రిన్సిపాల్ జయశ్రీ సమక్షంలో నిర్వహించిన విచారణలో విద్యార్థినులు పలు సమస్యలపై ఏకరువు పెట్టారు. తమకు కనీస సౌకర్యాలు లేవని, అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని, కనీసం హాస్టల్ వద్ద నైట్ వాచ్‌మెన్ కూడా లేదని వాపోయారు.అయితే నైట్ వాచ్‌మెన్ ఖర్చులంటూ తమ వద్ద నుంచి డబ్బులు వసూలు చేసేవారని తెలిపారు. మీ కేరీర్ మా చేతిలో ఉంది..బ్యాడ్ కాండక్ట్ అని రాస్తే మీకు భవిష్యత్ ఉండదని పలుమార్లు ప్రిన్సిపాల్ బెదిరించేవారని విచారణ అధికారుల ముందు వాపోయారు.సమస్యలన్నీ విన్న తరువాత ఎవరికి వారు తమ సమస్యలను కాగితంపై రాసి ఇవ్వాలంటూ చెప్పడంపై విద్యార్థులు భయపడ్డారు.విచారణలో ఆర్‌జేడీ నాగమణి, ఏసీసి సుభాషిణి పాల్గొన్నారు.గతంలో విద్యార్థినులపై అసభ్యంగా ప్రవర్తించిన తెలుగు లెక్చరర్‌ను సస్పెండ్ చేశారు. మరొకరిని సీతానగరం మండలానికి బదిలీ చేయడంతో పాటు అటెండర్‌పై చర్యలు చేపట్టిన సంగతి తెలిసిందే.



హోంగార్డుల స్థాపక దినోత్సవంలో మాట్లాడుతున్న ఎస్పీ నరసింహ కిశోర్

హోంగార్డులు పోలీస్ శాఖలో అంతర్భాగమే

ఎస్పీ నరసింహ కిశోర్

రాజమహేంద్రవరం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖలో హోంగార్డులు నిస్వార్థ సేవలందిస్తున్నారని ఎస్పీ నరసింహ కిశోర్ అన్నారు. హోంగార్డుల 62వ స్థాపక దినోత్సవం సందర్భంగా శుక్రవారం జరిగిన కార్యక్రమానికి హాజరై గౌరవ వందనం స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడారు. పోలీసు శాఖలో హోంగార్డులు అంతర్భాగమన్నారు. వీరిలో కొందరు పోలీస్ స్టేషన్లలో కంప్యూటర్ ఆపరేటర్లుగా తదితర సేవలు అందిస్తున్నారని చెప్పారు. ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో శాఖకు మంచి పేరు తేవాలని సూచించారు. సేవాభావంతో ముందుకు సాగాలన్నారు.అనంతరం హోం గార్డులతో ఎస్పీ ముఖాముఖి మాట్లాడి వారి కుటుంబ పరిస్థితులు,విధుల్లో ఇబ్బందులు, ఆర్థిక సమస్యలపై ఆరా తీశారు. వెంటనే పరిష్కార దిశగా చర్యలు తీసుకోవాలని అధికా రులను ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు ఏవీ సుబ్బరాజు,ఎన్‌బీఎం మురళీ కృష్ణ, ఎల్.చెంచి రెడ్డి, డీఎస్పీలు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ల రైటర్లకు శిక్షణ

ఎస్పీ నరసింహ కిశోర్ స్వీయ పర్యవేక్షణలో అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) మురళీకృష్ణ ఆధ్వర్యంలో సిబ్బంది శిక్షణ ఇస్తున్నారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల రైటర్లు, అసిస్టెంట్ రైటర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, పీజీఆర్ఎస్, సీసీటీ ఎన్ఎస్ అప్డేషన్,అఫెండర్ సర్వెలెన్స్, చాట్ జీపీటీ తదితర పోలీసు అప్లికేషన్లపై రెండు రోజుల పాటు 45 మందికి శిక్షణ ఇచ్చారు.



రోడ్లకు.. మహర్దశ!

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దృష్టి
- ఆర్అండ్‌బీ రోడ్ల మరమ్మతులు
- రూ.127.48 కోట్లు మంజూరు
- 407 పనులకు టెండర్లు
- 377 పనులు ప్రారంభం
- కోడ్‌తో ఆగిన 30 పనులు
- 13, 16 తేదీల్లో రీటెండర్లు
- జనవరి నెలాఖరుకు గడువు

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రహదారి మరమ్మతు పనులు ఉమ్మడి జిల్లాలో పూర్తిస్థాయిలో త్వరలోనే ప్రారంభం కానున్నాయి. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో కొన్నిచోట్ల జాప్యం జరిగింది. కోడ్ ముగిసిన వెంటనే పెండింగ్‌లో ఉన్న ఆర్అండ్‌బీ రోడ్డు మరమ్మతు పనులకు సంబంధించి టెండర్లను పిలవడానికి అధికారులు కసరత్తు చేస్తున్నారు. ప్రధానంగా 30 ఆర్అండ్‌బీ రోడ్ల మరమ్మతు పనులకు టెండర్లకు ఆహ్వానం పలకనున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో రూ.127.48 కోట్లతో 407 పనులు చేయాలని ఎన్నికల కోడ్‌కు ముందు టెండర్లను ఆహ్వానించారు. కాంట్రాక్టర్ల నుంచి టెండర్లు రావడంతో 377 పనుల వరకు ఖరారు చేశారు. వీటిలో తొలి ఫేజ్‌లో 172 రోడ్డు మరమ్మతు పనులు ప్రారంభించారు. తర్వాత ఫేజ్‌లో మిగిలిన 205 పనులను మొదలుపెట్టారు. ఇటీవల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక నేపథ్యంలో 30 పనులకు సంబంధించి టెండర్లు ఖరారు కాలేదు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఈ పనులకు ఈనెల 13,16వ తేదీల్లో టెండర్లకు ఆహ్వానం పలకాలని ఆర్అండ్‌బీ అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈనెల 12వ తేదీతో ఎన్నికల మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ ముగియనుంది. దీంతో నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం టెండర్లను పిలుస్తున్నారు. టెండర్లు పిలిచిన తర్వాత అగ్రిమెంట్లు చేసుకుని ఆర్అండ్‌బీ రోడ్డు మరమ్మతు పనులను చేపట్టనున్నారు.

గత ప్రభుత్వంలో అధ్వానం..

గత వైసీపీ ప్రభుత్వంలో ఒక్క రోడ్డు మరమ్మతు పని కూడా చేయలేదు. దీంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఆర్అండ్‌బీ రహదారులు అధ్వానంగా దర్శనమిచ్చాయి. ఉమ్మడి జిల్లా వాసులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వర్షం పడితే గుంతల రోడ్లపై ప్రయాణించలేక వాహనదారులు ప్రమాదాల బారిన పడ్డారు. ఐదునెలల కిందట కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రోడ్ల దశ మారింది. రోడ్ల మరమ్మతులకు పెద్దఎత్తున నిధులు విడుదల చేశారు. దీంతో రోడ్లపై గతుకుల బాధ తప్పుతోంది. ఉమ్మడి జిల్లాలో కాకినాడ, అమలాపురం, రాజమహేంద్రవరంతో పాటు ఇతర పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల మరమ్మతులు జరుగుతున్నాయి.

తుఫాన్ల వల్ల జాప్యం

గత రెండు నెలల్లో సంభవించిన తుఫాన్ల వల్ల మరమ్మతు పనులు చేయడానికి ఆటంకాలు ఏర్పడ్డాయి. రోడ్లపై నీరు నిలిచిపోవడం వల్ల కొంతవరకు జాప్యం జరిగినట్టు అధికారులు చెప్తున్నారు. ప్రస్తుతానికి వాతావరణం అనుకూలంగా ఉండడం వల్ల పనుల వేగం పెరుగుతుందని అందరూ భావిస్తున్నారు. ఈ విషయమై కాకినాడ సర్కిల్ ఆర్అండ్‌బీ ఎస్ఈ జి.కంఠును 'ఆంధ్రజ్యోతి' సంప్రదించగా పెండింగ్‌లో ఉన్న పనులకు కోడ్ ముగిసిన వెంటనే టెండర్లు పిలుస్తున్నామన్నారు. వచ్చే ఏడాది జనవరి నెలాఖరుకల్లా మొత్తం మరమ్మతు పనులు పూర్తి చేసేలా కార్యాచరణ అమలు చేస్తున్నామన్నారు. ఈ పనులు చేసేందుకు నిధులు సిద్ధంగా ఉన్నాయని, అడ్డంకులు ఎదురైనా వాటిని అధిగమించి నిర్దేశిత సమయానికి ఆర్అండ్‌బీ రోడ్డు మరమ్మతు పనులు పూర్తి చేస్తామని చెప్పారు.



నేడు షష్ఠి

సుబ్రహ్మణ్య షష్ఠి ఉత్సవాలకు ఆలయాలు ముస్తాబయ్యాయి.. జిల్లాలోని బిక్కవోలు, రాజానగరం, కొవ్వూరు, తాళ్లపూడి, దేవరపల్లి, గోపాలపురం తదితర ప్రాంతాల్లో శనివారం నుంచి షష్ఠి ఉత్సవాలు ఘనంగా జరుగుతాయి. ఈ మేరకు ఆలయాల వద్ద భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.. - 8,10లో

'అయ్.. మా రాజమండ్రిలో ఇమానం ఎక్కి హైదరాబాద్ వచ్చామండి'.. మా ఎయిర్‌పోర్టు ఎంతో అందంగా ఉంటది తెలుసాండీ'. నిజమే.. రాజమహేంద్రవరం కీర్తి కిరీటంలోని కలికితురాళ్లలో మధురపూడి విమానాశ్రయం ఒకటి. దీనిని ముద్దుగా గోదారోళ్ల విమానాశ్రయం అని కూడా పిలుచుకుంటారు. - 8లో



అయ్..ఇది గోదారోళ్ల ఎయిర్‌పోర్ట్

10, 11 తేదీల్లో కలెక్టర్లతో సీఎం చంద్రబాబు సమీక్ష

రాజమహేంద్రవరం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి) : అమరావతిలో ఈ నెల 10,11 తేదీల్లో సీఎం చంద్రబాబు జిల్లా కలెక్టర్లతో సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. సమావేశానికి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి హాజరు కానున్నారు. దీనిలో భాగంగా ప్రభుత్వ శాఖల వారీ చేపట్టిన పనుల పురోగతిని శుక్రవారం కలెక్టర్ సమీక్షించారు. జిల్లాలో వివిధ శాఖల ద్వారా చేపట్టిన పనులు వేగవంతం చేయాలని, సీఎస్ఆర్ నిధులతో చేపట్టిన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. పనుల పురోగతిపై ఫొటోలు అందజేయాలన్నారు. సీఎస్ఆర్ పనుల్లో భాగంగా గోకవరం అస్సాగో సౌజన్యంతో రూ.8 లక్షలతో రాజమహేంద్రవరం గిరిజన సంక్షేమ పీఎంఎస్ వసతి గృహాన్ని అభివృద్ధి చేస్తున్నామన్నారు. బలభద్రపురంలోని గ్రాసం ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ నిధులు రూ.22 లక్షలతో గిరిజన సంక్షేమ పీఎంఎస్ బాలుర వసతి గృహం పనులు త్వరలో ప్రారంభిస్తామని చెప్పారు. సర్వారాయ సుగర్స్ బాటిలింగ్ యూనిట్ తరపున రూ.2 లక్షలతో కడియం బీసీ బాలుర వసతి గృహం భవనం పనులు చేసినట్టు తెలిపారు. సమావేశంలో జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి ఎల్.అప్పలకొండ, డీఆర్‌డీఏ పీడీ ఎన్‌వీవీఎస్ మూర్తి, సాంఘిక సంక్షేమ అధికారి ఎం.సందీప్ పాల్గొన్నారు.



నాడు కుదరదని.. నేడిచ్చేశారు!

నాడు నిబంధనలకు విరుద్ధంగా వేసిన రోడ్డుకు నేడు బిల్లుల చెల్లింపులు

- నాడు 'ఆంధ్రజ్యోతి' కథనం
- బిల్లులు ఆపేసిన అధికారులు
- నేడు గుట్టుగా చెల్లింపులు
- నాటి అధికారులే నేటికీ
- అయినా ఎందుకో మారారు
- కలెక్టర్ తేల్చాలని డిమాండ్

అధికారం మారింది.. అధికారులు మాత్రం మారలేదు.. నేటికీ ఆ వైపే ఉన్నారు.. నాడు నిబంధనలకు విరుద్ధంగా చేసిన పనులకు నేటికీ కొమ్ముకాస్తున్నారు.ఈ సంఘటనే అందుకు ఉదా హరణ.. గత ప్రభుత్వ హయాంలో కనీసం పంచాయతీల తీర్మానం కాకుండా రూ.1.30 కోట్ల తో ఇష్టానుసారం ఒక రోడ్డు వేసేశారు.. ఆ రోడ్డుపై 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితం కావడంతో నాడు బిల్లులు ఆపేశారు.. అయితే ఈ ఐదు నెలల్లో ఏం జరిగిందో ఏమో కానీ.. అన్నీ తెలిసిన ఆ అధికారే గుట్టుచప్పుడు కాకుండా బిల్లులు చెల్లించేశారు.. దీనిపై భిన్న వాదనలు వినిపిస్తున్నాయి.

రాజమహేంద్రవరం రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మనోళ్లే.. బిల్లులు చెల్లించేయండి.. ఈ మాట కూటమి ప్రభుత్వ నేతలకో, కార్యకర్తలకో కాదు.. గత ప్రభుత్వ హయాంలో ఉపాధి నిధులతో నిబంధనలకు విరుద్ధంగా వేసిన రోడ్డుకు సంబంధించి రూ.1.30 కోట్లు చెల్లింపులు గుట్టుచప్పుడు కాకుండా జరిగిపోయాయి. రాజమహేంద్రవరం రూరల్ మండలం పరిధి హుకుంపేట,పిడింగొయ్యి. శాటిలైట్‌సిటీ పరిధి పిట్టలవారి చెరువు ప్రాంతం నుంచి ప్రైవేటు లే అవుట్ల (జనావాసాలు లేని) వెంబడి ఆదిత్య తక్ష ప్రైవేటు పాఠశాల వరకు 1183 మీటర్ల పొడవు గల సీసీ రోడ్డు ఉపాధి నిధులతో గత ప్రభుత్వ హయాంలో నిర్మించారు.ఈ రోడ్డు నిర్మాణానికి మూడు గ్రామ పంచాయతీల తీర్మానం ఉండాల్సి ఉండగా ఒక్క పిడింగొయ్యి పంచాయతీ ప్రత్యేకాధికారి,విశ్రాంత జిల్లా పంచాయతీ అధికారి జానా సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి రూప్ చంద్‌ల తీర్మానంతో 2024 జూన్ నెలలో రోడ్డు నిర్మాణం చేపట్టి పూర్తిచేశారు. గత ప్రభు త్వంలో ఇన్‌చార్జి మంత్రి చెల్లుబోయిన వేణుగోపా లకృష్ణ అప్పటి జిల్లా కలెక్టర్ మాధవీలత ఒత్తిడి చేయడంతో తాము తీర్మానం చేశామని పంచా యతీ అధికారులు, వారంతా పెద్ద వాళ్లు కావ డంతో తామేమీ చేయలేక పనులు చేయాల్సి వచ్చిందని మండల పరిషత్, ఇంజనీరింగ్ అధికారులు నాడు చెప్పుకొచ్చారు. ఇదే విషయమై జూన్ 17న ఆంధ్రజ్యోతి దినపత్రికలో "సర్కారు సొమ్ముతో షోకులు" అన్న శీర్షికన ఒక కథనం ప్రచురితమైంది.దీనిపై సంబంధిత పనులకు సంబంధించి వర్క్ రికార్డింగ్ చేయబోమని ఇంజనీరింగ్ అధికారులు, లేబరు కాం పోనెంట్, బిల్లులు నిలుపుదల చేస్తామని ఎంపీడీవో, ఎన్ ఆర్ఈజీఎస్ అధికారులు తెలిపారు. సుమారు ఐదు నెలలు తిరిగేసరికి సీన్ రివర్స్ అయింది. వారంతా చుట్టాలైపోయారు.. ధనం మూలం ఇదం జగత్ అంటే ఇదే అనేలా..అప్పటి ఇంజ నీరింగ్ అధికారులు,ఎంపీడీవో కూడా మారలేదు.గత ప్రభుత్వంలోను వీరే. ప్రస్తుతం వీరే ఉన్నారు.. అయినా గుట్టుచప్పుడు కాకుండా బిల్లులు చేసేశారు. దీనిపై రకరకాల ఆరోపణలు వినిపిస్తు న్నాయి. నాడు ఆపిన బిల్లులు నేడు ఎలా చెల్లింపులు చేశారో తెలియక చాలా మంది తలలు పట్టుకుంటున్నారు.కలెక్టర్ ప్రశాంతి ఆ రోడ్డును పరిశీలించి బిల్లుల చెల్లింపులపై దృష్టి సారించాలని డిమాండ్ చేస్తున్నారు.

బహిరంగ మూత్ర విసర్జన చేస్తే రూ.500 కట్టాల్సిందే!

కొవ్వూరులో అమలు : కమిషనర్

కొవ్వూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : కొవ్వూరు వెళ్లి బహిరంగ మల, మూత్ర విసర్జన చేశారో జాగ్రత్త..ఒక వేళ చేస్తే రూ.500 ఫైన్..కొవ్వూరు మునిసిపాలిటీని బహిరంగ మల, మూత్ర విసర్జన రహిత పట్టణంగా తీర్చిదిద్దడానికి మునిసిపల్ కమిషనర్ టి.నాగేంద్రకుమార్ చర్యలు చేపట్టారు. స్వచ్ఛభారత్ 2.0లో భాగంగా కొవ్వూరు పట్టణాన్ని బహిరంగ మల,మూత్ర విసర్జన రహిత (ఓడీఎఫ్ ప్లస్) పట్టణంగా ప్రకటించడం జరిగిందన్నారు. ఈ నేపథ్యంలో పట్టణ ప్రజలంతా స్వచ్ఛతను పాటించాలన్నారు.నిబంధనలు అతిక్రమిస్తే రూ. 200ల నుంచి 500ల వరకు జరిమానా విధించడం జరుగుతుందన్నారు.ఈ మేరకు ఊరూవాడా ప్రచారం చేశారు.కొవ్వూరులో బహిరంగ మల, మూత్ర విసర్జన జరిగే ప్రాం తాలపై దృష్టి పెట్టామని కమిషనర్ తెలిపారు.

మధురపూడి విమానాశ్రయం



ఆయ్.. ఇది.. గోదారోళ్ల ఎయిర్‌పోర్టు!

- రోజుకు 22 విమానాలు.. 1600 మంది ప్రయాణం
- అతి పెద్ద విమానమూ దిగే రన్‌వే ఇక్కడి ప్రత్యేకత
- రూ.347 కోట్లతో మరో టెర్మినల్ నిర్మాణం
- నేడు పౌర విమానయాన దినోత్సవం

- ఆంధ్రజ్యోతి/రాజమహేంద్రవరం

'అయ్.. మా రాజమండ్రిలో ఇమానం ఎక్కి హైదరాబాద్ వచ్చామండి'.. మా ఎయిర్‌పోర్టు ఎంతో అందంగా ఉంటది తెలుసాండీ'. నిజమే.. రాజమహేంద్రవరం కీర్తి కిరీటంలోని కలికితురాళ్లలో మధురపూడి విమానాశ్రయం ఒకటి. దీనిని ముద్దుగా గోదారోళ్ల విమానాశ్రయం అని కూడా పిలుచుకుంటారు. ఇంతింతై వటుడింతై అన్నట్టుగా ఈ ఎయిర్‌పోర్టు అభివృద్ధిలో వాయు వేగంతో దూసుకుపోతోంది. అటు ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా.. ఇటు పాలకుల చొరవ.. ముఖ్యంగా ప్రయాణికుల ఆదరణతో ఎంత పెద్ద విమానమైనా దిగే దశకు చేరుకొంది. గత ఏడాది సీ-30, సీ-31 వంటి యుద్ధ విమానాలు కూడా ఇక్కడ దిగాయి. మరో 20 ఏళ్ల అవసరాలకు సరిపడా సాధనా సంపత్తినీ సమకూర్చుకుంటోంది. ఆ వైపున కోనసీమ నుంచి ఇటు మెట్ట, ఏజెన్సీని కలుపుకొని మొత్తం ఆరు జిల్లాల వారికి నిరంతరం సేవలందిస్తోంది. నేడు అంతర్జాతీయ పౌరయాన దినోత్సవం సందర్భంగా గోదారోళ్ల విమానాశ్రయం (మధురపూడి ఎయిర్‌పోర్టు) గురించి 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.



రన్‌వేలో విమానం



● ఇంతింతై.. ఎయిర్‌బస్‌లు ఎగిరేంతై..

ఈ విమానాశ్రయాన్ని బ్రిటీషర్లు తమ అవసరాల కోసం సుమారు 300 ఎకరాల్లో నిర్మించారు. తర్వాత వాణిజ్య, విద్య, మెడికల్ తదితర రంగాల్లో ఈ ప్రాంతం వేగంగా అభివృద్ధి చెందడంతో అదే తీరులో విమానాశ్రయం అభివృద్ధి చెందింది. రెండో విడత 800 ఎకరాలకు, తర్వాత 1218 ఎకరాలకు విస్తరించారు. 1985 నుంచి 1994 వరకూ వాయుదూత్ విమానాలను నడిపారు. ఇప్పుడు ఇక్కడ 3,165 మీటర్ల రన్‌వే ఉండగా.. గంటకు 10 విమానాలు.. రోజుకు 50 విమానాలు వచ్చి వెళ్లినా ఆపరేట్ చేయగలిగిన సామర్థ్యం ఉంది. దేశంలో అతిపెద్ద విమానాలు సైతం రాకపోకలు సాగించే స్థాయికి చేరుకొంది. ప్రస్తుతం రోజుకు 22 మంది విమానాలు నడుస్తుండగా 1,600 మంది వరకూ రాకపోకలు సాగిస్తున్నారు. ప్రతి రోజూ ఉదయం 7 గంటలకు ఎయిర్‌పోర్ట్ తెరుస్తారు. 8 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకూ విమానాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఇప్పటివరకూ చెన్నై, హైదరాబాద్, బెంగళూరుకు సర్వీసులున్నాయి. చిన్న విమానాలు మాత్రమే నడుస్తున్నాయి. తొలిసారిగా ముంబైకి ఇటీవల ఎయిర్‌బస్‌ని ప్రారంభించారు. ఈనెల 12 నుంచి ఢిల్లీకి విమానం అందుబాటులోకి రానుంది. హ్యాంగర్స్ (విమానాల పార్కింగ్ ప్రదేశం)కి అవసరమైన స్థలం ఉంది.

మరో టెర్మినల్ నిర్మాణం

ప్రస్తుతం ఒక టెర్మినల్ అందుబాటులో ఉంది. అయితే రానున్న 20 ఏళ్ల ట్రాఫిక్‌ని దృష్టిలో పెట్టుకొని 21 వేల చదరపు మీటర్లలో రూ.347 కోట్లతో మరో టెర్మినల్‌ని నిర్మిస్తున్నారు. వచ్చే ఏడాది ఆగస్టు నాటికి ఇది అందుబాటులోకి వచ్చే విధంగా పనులు జరుగుతున్నాయి. దీని నిర్మాణం పూర్తయితే ఒకేసారి 2వేల మంది ప్రయాణికులను హ్యాండిల్ చేయగలిగిన సామర్థ్యం ఉంటుంది. ప్రయాణికులకు సదుపాయాలు, కార్గో, పార్కింగ్ వంటివి అంతర్జాతీయ స్థాయిలో ఉంటాయి.

● ఇవీ అందుబాటులోకి వస్తే...

మన ప్రాంతంలోని కాకినాడ నుంచి సముద్ర ఉత్పత్తులు, భీమవరం నుంచి రొయ్యలు, కోనసీమ నుంచి కొబ్బరి ఉత్పత్తులు, వస్త్రాల రవాణా ఎక్కువగా ఉంటోంది. రాజమండ్రిలోని వాణిజ్యంలో వస్త్ర దుకాణాలు మొదటి వరుసలో ఉంటాయి. ఈ నేపథ్యంలో కార్గో అవసరత ఎక్కువగా కనిపిస్తోంది. ప్రస్తుతం ఆ సేవలు అందిస్తున్నా.. చిన్న విమానాలు కావడంతో ఎక్కువగా ఉపయోగం లేకపోయింది. ఇప్పుడు ముంబైకి ఎయిర్‌బస్ ప్రారంభం కావడంతో.. మొత్తం కలిసి రోజుకు 5 టన్నుల వరకూ సరుకు రవాణా చేసే వెసులుబాటు కలిగింది. అదేవిధంగా ఈ ప్రాంతం నుంచి ఆధ్యాత్మిక, పర్యాటక ప్రయాణాలు కూడా ఎక్కువగా ఉంటాయి. ప్రస్తుతం తిరుపతి, శిరిడీకి రైళ్లలో బెర్తులు దొరకడం అదృష్టంపై ఆధారపడి ఉంటోంది. అయోధ్యకు అసలు నేరుగా రైలు సదుపాయం లేదు. ఈ సీజన్‌లో శబరిమల (కోచి ఎయిర్‌పోర్ట్)కూ స్వాములు ఎక్కువగానే విమానాలను ఆశ్రయిస్తున్నారు. వీటిని కూడా విమానయాన సంస్థలు అందిపుచ్చుకోవచ్చు. అయితే ప్రస్తుతం ఇండిగో సంస్థ ఒకటే ఇక్కడ నుంచి విమానాలను ఆపరేట్ చేస్తోంది. విమానాశ్రయం అభివృద్ధి చేయడమే కాకుండా మరిన్ని విమానయాన సంస్థలు విమానాలు నడిపేలా చర్యలు తీసుకుంటే ఉపయోగకరంగా ఉంటుంది. జనాదరణ బాగానే ఉన్నా ఆపరేటర్లు లేని పరిస్థితి నుంచి బయటపడాలి. అలాగే ముఖ్యంగా ఎయిర్ అంబులెన్స్‌ని అందుబాటులోకి తీసుకురావాలి. దేశీయంగా మరిన్ని నగరాలకు, అంతర్జాతీయంగా ఒకటి రెండు దేశాలకు విమాన సర్వీసులు తిరిగితే బాగుంటుంది.

140 మందితో 24 గంటలూ రక్షణ

ఎయిర్‌పోర్ట్ సెక్యూరిటీ బాధ్యతలను ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక రక్షక దళం (ఏపీఎస్‌పీఎఫ్) చూస్తోంది. కమాండెంట్ కేఎస్ రావు పర్యవేక్షణలో ఓ డీఎస్పీ ఆధ్వర్యంలో 140 ఎస్‌పీఎఫ్ సిబ్బంది షిఫ్టుల వారీగా విధుల్లో ఉంటారు. బోర్డింగ్ పాస్‌ల చెకింగ్, ప్రయాణికుల రాకపోకల్లో తనిఖీ, లగేజీ స్కానింగ్ వంటివన్నీ క్షుణ్ణంగా నిర్వహిస్తున్నారు. సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ విధివిధానాలను అనుసరించి పని చేస్తున్నారు. మహిళల చెకింగ్ కోసం మహిళా పోలీసులనూ అందుబాటులో ఉంచుతున్నారు.

మరింత విస్తరణ దిశగా..

అంతర్జాతీయ పౌర విమానయాన సంస్థ 50వ వార్షికోత్సవం సందర్భంగా 1994లో తొలిసారిగా అంతర్జాతీయ పౌర విమానయాన దినోత్సవం నిర్వహించారు. విమానయాన రంగం వల్ల ప్రజలకు కలుగుతున్న ప్రయోజనాలు, సేవలు, అభివృద్ధి వంటి వాటిపై ఆ రోజున అవగాహన కల్పిస్తారు. 2050 నాటికి జనాభాలో మూడింట రెండు వంతుల మంది నగరాల్లోనే నివసిస్తారని, విమాన ప్రయాణాలు విస్తరిస్తాయని ఐక్యరాజ్య సమితి అంచనా వేస్తోంది.

కొత్త సర్వీసులకు ప్రయత్నిస్తున్నాం..

వచ్చే వేసవికాలం నాటికి శిరిడీ, తిరుపతి, కోల్‌కతా, గోవా, అయోధ్య తదితర నగరాలకు విమానలు నడిపే ప్రయాత్నాలు చేస్తున్నాం. మిగతా ఎయిర్‌లైన్స్ సర్వీసుల ఆపరేటర్లు కూడా ముందుకు వస్తే బాగుంటుంది. విమానాశ్రయంలో సేఫ్టీ, సెక్యూరిటీ నూరు శాతం ఉంది. సదుపాయాల పరంగా అన్నీ ఉన్నాయి. అందువల్ల మరిన్ని విమానాలను అందుబాటులోకి తీసుకొచ్చే కృషి జరగుతోంది.

- ఎస్.జ్ఞానేశ్వరరావు, ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్





అఖండ శంఖారావ యుగళం దంపతులకు జాతీయ పురస్కారం

నిర్విరామంగా సుమారు 20 నిమిషాలపాటు ఓంకార ప్రణవనాదాన్ని ధ్వనిస్తూ శంఖాన్ని పూరించడంలో అనేక రికార్డులను కైవసం చేసుకున్న డాక్టర్ కొండ నరసింహారావు, అలివేలు మంగాదేవి దంపతులను కామధేను జాతీయ పురస్కారాలు -2024కి ఎంపిక చేసినట్టు విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ సంస్థ ప్రకటించింది. దీనిని ఈనెల 8న హైదరాబాద్‌లో నిర్వహించే నరసింహారావు రాజమహేంద్రవరం ప్రాంతీయ కేంద్రంగా ఉన్న ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక రక్షక దళం కమాండెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. 38 ఏళ్లుగా వివిధ కార్యక్రమాల్లో శంఖాన్ని పూరించి అనేక పురస్కారాలను అందుకున్నారు.

పి.గన్నవరం/రాజమహేంద్రవరం (ఆంధ్రజ్యోతి), డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నిర్విరామంగా సుమారు 20 నిమిషాలపాటు ఓంకార ప్రణవనాదాన్ని ధ్వనిస్తూ శంఖాన్ని పూరించడంలో రికార్డులను కైవసం చేసుకున్న పి.గన్నవరం గ్రామానికి చెందిన ఏపీఎస్పీఎఫ్ కమాండెంట్ డాక్టర్ కొండా నరసింహారావు, అలివేలు మంగాదేవి దంపతులు తాజాగా విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ సంస్థ కామధేను అవార్డ్-2024 జాతీయ పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ మేరకు సంబంధిత సంస్థ ఒక ప్రకటనలో తెలిపినట్టు నరసింహారావు తెలిపారు. ఈ అవార్డును ఈనెల 8న హైదరాబాదులో జరగబోయే అవార్డుల ప్రదానోత్సవంలో నరసింహారావు దంపతులకు కామధేను జాతీయ పురస్కారాన్ని ప్రదానం చేయనున్నట్టు సంస్థ వ్యవస్థాపకులు రాంబాబు నుంచి ఆహ్వానం అందింది. ప్రస్తుతం రాజమహేంద్రవరంలో ఏపీఎస్పీఎఫ్ (ఏపీ ప్రత్యేక రక్షణ దళం) కమాండెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న కొండా నరసింహారావు దంపతులు అఖండ శంఖారావ యుగళంగా పేరుగాంచారు. అంతేకాకుండా గత 38 ఏళ్లుగా వేలాది ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొని అఖండ శంఖారావాన్ని పూరించి పలు సంస్థలు నుంచి సువర్ణ ఘంటా కంకణాలు, సన్మానాలతోపాటు పలు అవార్డులు స్వీకరించారు. అలాగే దేశంలోని పలు ప్రాంతాల్లో శంఖారావం పూరించి పలువురు ప్రశంసలు పొందారు. అవార్డుకు ఎంపికైన కమాండెంట్ దంపతులకు పలువురు అభినందనలు తెలిపారు.

బియ్యం డంప్‌పై అధికారుల దాడులు



బియ్యంను పరిశీలిస్తున్న అధికారులు



తునిరూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడజిల్లా తుని మండలం కొలిమేరు సమీపంలో అక్రమంగా బియ్యం నిల్వలు దాచి పెట్టారన్న సమాచారంతో తుని రెవెన్యూ అధికారులు ఆకస్మిక దాడులు చేపట్టారు. కొలిమేరు గ్రామ శివారు మూతపడిన కోళ్ళఫారంలో సుమారు 500బస్తాలు బియ్యం అక్రమంగా నిల్వ ఉంచినట్లు గుర్తించారు. ఈ బియ్యం అదే గ్రామానికి చెందిన వైసీపీకి చెందిన ప్రజాప్రతినిధి రైస్‌మిల్ నుంచి గుట్టుచప్పుడు కాకుండా పొలాల మధ్యన ఉన్న కోళ్ళఫారంకు తరలించినట్లు తెలుస్తోంది. దీనిపై రెవెన్యూ అధికారులను ఆరా తీయగా సంబంధిత నిల్వల్లో రేషన్ బియ్యంగా అనుమానం ఉందని బియ్యం శాంపిల్స్‌సేకరించి ల్యాబ్‌కు తరలించనున్నట్లు తెలిపారు. తుది నివేదిక ఆధారంగా కోళ్ళఫారం నిర్వాహకులపై చర్యలు ఉంటాయని తెలిపారు. ఈ తనిఖీల్లో ఎంఎస్‌వో బి.రాజు, ఆర్ఐ తాతారెడ్డి, రూరల్ ఎస్ఐ కృష్ణమాచార్యులతోపాటుగా స్థానిక వీఆర్వో ఉన్నారు.

షష్ఠి ఉత్సవానికి ఏర్పాట్లు పూర్తి

నేడు బిక్కవోలు శ్రీకుమార సుబ్రహ్మణ్యేశ్వరుడి షష్ఠి



బిక్కవోలు షష్ఠి పందిరి అలంకరణ



స్వాగతం పలుకుతున్న వెంకటేశ్వరస్వామి సెట్టింగ్

బిక్కవోలు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లో పేరొంది శనివారం నిర్వహించే బిక్కవోలు శ్రీకుమారసుబ్రహ్మణ్యేశ్వరుడి షష్ఠి ఉత్సవానికి అన్నిఏర్పాట్లు పూర్తయ్యాయని ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పల్లి శ్రీనివాసరెడ్డి శుక్రవారం తెలిపారు. శనివారం తెల్లవారుజామున 1-20 గంటకు స్వామివారి తీర్థపుబిందె సేవతో ఉత్సవాలను ప్రారంభిస్తామన్నారు. అప్పటి నుం చి భక్తులకు స్వామి దర్శనాలు కల్పించనున్నట్టు తెలిపారు. భక్తుల దర్శనాలకు భారీ లైన్లు ఏర్పాటు చేశామన్నారు. ఆలయ ఆవరణ అంతా చలువ పందిరి వేసి విద్యుత్ దీపాలతో అలంకరించామని చెప్పారు. శనివారం ఉదయం స్వామివారిని మయూర వాహనంపై గ్రామోత్సవం, ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకూ ఆలయ ఆవరణలో వివిధ బ్యాండు కచేరీలు, 4.30 గంటల నుంచి 5.30 వరకూ పగలు బాణాసంచా ఉంటుందని రాత్రి 11గంటల నుంచి తెల్లవారే వరకూ స్థానిక ఉన్నత పాఠశాలలో గ్రామానికి చెందిన గోలింగేశ్వరా ఫైర్ వర్క్స్, కనకదుర్గా హస్సేనియా ఫైర్‌వర్క్స్ వారిచే బాణాసంచా పోటీలు జరుపుతామన్నారు. రాత్రి 8గంటల నుంచి స్వామివారి గ్రామోత్సవం కన్నుల పండువగా జరుపుతామన్నారు. ఆదివారం మధ్యాహ్నం స్వామివారి రథోత్సవం నిర్వహిస్తామన్నారు. ఈ నెల 12న మహాన్నదానంతో షష్ఠి ఉత్సవాలను ముగిస్తామన్నారు. 7 నుంచి 11 వరకూ షష్ఠి కళావేదికపై వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు.

270 మందితో పోలీసు బందోబస్తు

షష్ఠి ఉత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఉండేందుకు జిల్లా ఎస్పీ నరసింహకిషోర్ ఆధ్వర్యంలో 270 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తున్నట్టు అనపర్తి సీఐ సుమంత్, బిక్కవోలు ఎస్ఐ రవిచంద్రకుమార్ తెలిపారు. వీరిలో ఒక అడిషనల్ ఎస్పీ, నలుగురు డీఎస్పీలతోపాటు తొమ్మిది మంది సీఐలు, 19 మంది ఎస్ఐలు, 70 మంది మహిళా పోలీసులు, హోమ్‌గార్డులు, యాభై మంది ఏఎస్ఐ, హెచ్‌సీలు, 67 మంది కానిస్టేబుళ్లు, హోమ్‌గార్డులు విధులు నిర్వహిస్తారన్నారు. షష్ఠి సందర్భంగా ట్రాఫిక్ దృష్ట్యా బిక్కవోలు మెయిన్‌రోడ్‌లో ఫోర్ వీలర్లకు డిసెంబరు 7, 8 తేదీల్లో అనుమతులు నిలిపి వేశామని, వాహన యజమానులు సహకరించాలని వారు కోరారు.

సంతాన సుబ్రహ్మణ్యుడికి ఐదు రోజుల ఉత్సవాలు





రాజానగరంలోని శ్రీవల్లీదేవసేన సమేత సంతాన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, విద్యుద్దీపాలంకరణలో సుబ్రహ్మణ్యస్వామి ఆలయం

రాజానగరం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రాజానగరంలో సంతాన సౌభాగ్య ప్రదాతగా భక్తుల పూజలందుకుంటున్న శ్రీ వల్లీ దేవసేన సమేత సంతాన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి ఉత్సవాలు శనివారం నుంచి 11వ తేదీ వరకు ఘనంగా నిర్వహించేందుకు ఉత్సవకమిటీ అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయాన్ని రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. రాజమహేంద్రవరం వాస్తవ్యుడు తోట సత్యనారాయణ మూర్తి దంపతులు ప్రతిష్ఠించిన ఈ ఆలయం 98 వసంతాలు పూర్తి చేసుకుంటోంది. ఉత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహిస్తారు. సాయంత్రం స్వామి కల్యాణం కన్నుల పండువుగా జరుగుతుంది. సంతానం లేమితో బాధపడతున్న మహిళలు షష్ఠిరోజు నాగుల చీర ధరించి ఉపవాసదీక్షతో స్వామివారి సన్నిధిలో శయనిస్తారు. సాయంత్రం జరిగే స్వామి వారి కల్యాణాన్ని తిలకించి, తలంబ్రాలు బియ్యం చీరకొంగుతో ఒడిసి పట్టుకుని అనంతరం ఇంటికి వచ్చి క్షీరాన్నం వండుకుని భుజిస్తే సంతానం కల్గుతుందని భక్తులు విశ్వసిస్తారు. ఐదు రోజుల పాటు కొనసాగే ఈ ఉత్సవాల్లో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు అలరించనున్నాయి.ఉత్సవ కమిటీ ప్రత్యేక బారి కేడ్లు ఏర్పాటు చేశారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడు పెండ్లి కొడుకాయనే..

● నేటి రాత్రికి దివ్యకల్యాణం



పెండ్లి కుమారుడు, పెండ్లికుమార్తెలుగా సుబ్రహ్మణ్యేశ్వరుడు, వల్లీదేవసేనలకు పూజలు నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): గ్రామంలో ఉన్న వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరుడి దివ్యకల్యాణ ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. సాయంత్రం 4గంటలకు ప్రత్యేక వేదికపై నవవధూవరులు కానున్న స్వామి,అమ్మవార్లను ఆశీనులు గావించి పండితులు గణపతిపూజ, పుణ్యాహవచనం ఉల్లూకుల గౌరీపూజను నిర్వహించిన అనంత రం ముత్తైదువులు పసుపుదంచారు. ఈసందర్భంగా స్వామి,అమ్మవార్లకు నుదుట తిలకం బుగ్గనచుక్క పెట్టి దివ్యాభరణాలను అలంకరించారు. రాత్రి 7గంటలకు మయూ ర, శేషతల్ప వాహనాలపై వివిధ సాంస్కృతిక కార్యక్రమాల నడుమ గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయకమిటీ ప్రత్యేక ఏర్పాట్లను చేశారు.

సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం

సుబ్రహ్మణ్య షష్ఠి పురస్కరించుకుని శనివారం రాత్రి 8గంటలకు దివ్యకల్యాణం దేవస్థానం హైస్కూల్ ప్రాంగణంలో ఘనంగా నిర్వహిస్తారు. ఉదయం అన్నవరం పరిసర ప్రాంతాల నుంచి విచ్చేసే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా క్యూలైన్, ప్రసాదం వితరణ కేంద్రాలు, కమిటీ ఏర్పాటుచేశారు. ఆదివారం రాత్రి జరిగే శ్రీపుష్పయోగంతో వేడుకలు ముగుస్తాయి.

పసుపు దంచుతున్న ముత్తైదువులు



సత్యదేవుడి దత్తత ఆలయంగా

బలిఘట్టం సత్యదేవుడి ఆలయం

● పత్రాలను దేవస్థానం అధికారులకు అందజేసిన శాసనసభ స్పీకర్

అన్నవరం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అన్నవరం సత్యదేవుడి దత్తత ఆలయంగా అనకాపల్లిజిల్లా బలిఘట్టం సత్యదేవుడి ఆలయం చేరింది. దీనిని లాంఛ నంగా శుక్రవారం శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు రత్నగిరికి విచ్చేసి లాంచనప్రాయంగా సంబంధిత పత్రాలను దేవస్థానం ఈవో త్రినాథరావు, చైర్మన్ రోహిత్‌లకు అందజేశారు. గతంలో ఈ ఆలయాన్ని అన్నవరం దేవస్థానం నిధులు సుమారు రూ.45లక్షలతో నిర్మించారు. వీటి నిర్వహణను అప్పట్లో ఆ గ్రామపెద్దలు చూసుకునేవారు. అనంతరం నిర్వహణా భారం, ప్రత్యేకశ్రద్ధను ఎవరూ కనబరచకపోవడంతో స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రతిపాదన మేరకు దేవదాయశాఖ అంగీకారం తెలిపింది. ఈ ఆలయానికి సుమారు 36ఎకరాల భూమి ఉండ గా ఆ పత్రాలను దేవస్థానం అధికారులు తీసుకున్నా రు. దీని నిర్వహణకు ఏటా రూ.5లక్షల వ్యయం అవుతుందని అధికారులు తెలిపారు. ఇప్పటికే అన్న వరం దేవస్థానం పరిధిలో దత్తత ఆలయాల సంఖ్య తొమ్మిదికి చేరింది. అంతకు ముందు ఆలయానికి విచ్చేసిన అయ్యన్నపాత్రుడు కుటుంబసభ్యులకు దేవస్థానం ఈవో త్రినాథరావు, చైర్మన్ రోహిత్‌లు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేశారు. కార్యక్రమంలో పీఆర్వో కొండలరావు, సూపరింటెండెంట్ బలువు సత్యశ్రీనివాస్ పాల్గొన్నారు.



బలిఘట్టం ఆలయ దత్తతకు సంబంధించిన పత్రాలు అందజేస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

'లోవ'లో హుండీల లెక్కింపు

తునిరూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం లోవ దేవస్థానంలో ఆలయం ఉన్నతాధికారులు శుక్రవారం హుండీలు లెక్కించారు. అమ్మవారిదేవస్థానానికి సంబంధించిన హుండీలు తెరిచి లెక్కించగా 76రోజులకు రూ.39,39,250లు ఆదాయం సమకూరినట్లు దేవస్థానం ఉప కమిషనర్, కార్యనిర్వాహణాధికారి కె.విశ్వనాధ్‌రాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ గొర్లి అచ్చియ్యనాయుడు, ధర్మకర్తలతోపాటుగా ప్రత్యేకాధికారిగా తంటికొండ వెంకటేశ్వరస్వామి వారి దేవస్థానం కార్యనిర్వహణాధికారి డి.సత్యనారాయణ, సిరిపురం గ్రూప్ టెంపుల్స్ కార్యనిర్వహణాధికారిణి ఎం.సూర్యామణి ఉన్నారు.



ఆలయ ప్రాంగణంలో హుండీలు లెక్కిస్తున్న సిబ్బంది

దశాబ్దాల కల సాకారం

రామచంద్రపురంలో జిల్లా అదనపు సెషన్స్ కోర్టు సిద్ధం
ఈనెల 10న ప్రారంభించనున్న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం ప్రజల దశాబ్దాల కల సాకారం అవుతుంది. ప్రజలు ఎదురుచూస్తున్న జిల్లా అదనపు సెషన్స్ కోర్టు రామచంద్రపురంలో ప్రారంభానికి సిద్ధ అయ్యింది. ఈ నెల 10న రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ రామచంద్రపురంలో జిల్లా అదనపు సెషన్స్ కోర్టును వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. దీంతో రామచంద్రపురం పరిసర మండలాల ప్రజలు, కక్షిదారులు, న్యాయవాదులకు జిల్లా కోర్టు బెంచి ద్వారా న్యాయసేవలు చేరువ కానున్నాయి.


రామచంద్రపురంలో జిల్లా అదనపు సెషన్స్ కోర్టు భవనం

రామచంద్రపురం (ద్రాక్షారామ) డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురంలో 1994 నుంచి జిల్లా సెషన్స్ కోర్టు బెంచి ఏర్పాటు ప్రయత్నాలు ప్రారంభించారు. పలు బార్ అసోసియేషన్ కార్యవర్గాలు, సీనియర్ న్యాయవాదులు, ప్రజా ప్రతినిధులు జిల్లా సెషన్స్ కోర్టు ఏర్పాటుకు ప్రయత్నాలు చేశారు. అయితే ప్రస్తుత బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పిల్లి మురళీ, కార్యవర్గం, ఇతర సీనియర్ న్యాయవాదుల కృషి ఫలించింది. దీంతో 15 మార్చి 2024న రామచంద్రపురంలో జిల్లా అదనపు సెషన్స్‌కోర్టు ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి ఎన్నికల కోడ్ రావడంతో కొంత ఆలస్యం జరిగింది. తిరిగి కోర్టు ఏర్పాటు వేగవంతంగా జరిగింది. 1931 నుంచి జూనియర్ సివిల్‌జడ్జి కోర్టు నిర్వహిస్తున్న భవనంలో జిల్లా అదనపు సెషన్స్ కోర్టు ఏర్పాటు చేశారు. జూనియర్ సివిల్ జడ్జి కోర్టును బార్ అసోసియేషన్ భవనంలోకి మార్చి నిర్వహిస్తున్నారు.

వర్చువల్‌గా ప్రారంభం...

రామచంద్రపురంలో ఏర్పాటు చేసిన జిల్లా అదనపు సెషన్స్ కోర్టును రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ ఈనెల 10న ఉదయం 10.15 గంటలకు వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా పరిపాలనా న్యాయమూర్తి నైనాల జయసూర్య, న్యాయమూర్తులు ఆర్.రఘునందనరావు, బీవీఎల్ఎన్ చక్రవర్తి, టి.మల్లి ఖార్జున, సుమతిజగడం, న్యాపతి విజయ్ సమక్షంలో ప్రారంభోత్సవం జరుగుతుందని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పిల్లి మురళీ, కార్యదర్శి వాడ్రేవు సాయి ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జిల్లా జడ్జి గంధం సునీత పాల్గొంటారన్నారు.

తీరనున్న ప్రజల కష్టాలు...

రామచంద్రపురంలో జిల్లా అదనపు సెషన్స్ కోర్టు ఏర్పాటుతో ప్రజలు, కక్షిదారుల కష్టాలు తీరనున్నాయి. జిల్లా కోర్టుసేవలు ప్రజలకు మరింత చేరువకానున్నాయి. ఇప్పటివరకు రామచంద్రపురం జూనియర్ సివిల్ జడ్జి, సీనియర్ సివిల్ జడ్జి, మెజిస్ట్రేట్ కోర్టు తీర్పులు, ఆలమూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, అనపర్తి జూనియర్ సివిల్ జడ్జి కోర్టు తీర్పులపై అప్పీలుకు జిల్లా కోర్టు పరిధిలోకి వచ్చే సివిల్, క్రిమినల్ కేసులకు రాజమహేంద్రవరం జిల్లా సెషన్స్ కోర్టుకు వెళ్లవలసి వచ్చేది. రామచంద్రపురంలో జిల్లా కోర్టు ఏర్పాటుతో రామచంద్రపురం పట్టణం, మండలం, కె.గంగవరం, కపిలేశ్వరపురం, ఆలమూరు, రాయవరం, మండపేట, అనపర్తి, బిక్కవోలు మండలాల ప్రజలకు దూరభారం తప్పనుంది.

మహిళల రక్షణకు ప్రత్యేక చర్యలు

» ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్ » కోట సత్తెమ్మతల్లి ఆలయంలో పూజలు


కోటసత్తెమ్మ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఐజీ, ఎస్పీ


నిడదవోలు పోలీస్‌స్టేషన్‌లో మాట్లాడుతున్న ఐజీ అశోక్‌కుమార్

నిడదవోలు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లాలో మహిళలు, చిన్నారుల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఏలూరు రేంజ్ ఐజీ జి.అశోక్‌కుమార్ తెలిపారు. నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెంలో కోట సత్తెమ్మతల్లిని శుక్రవారం ఆయన, జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం, పండితులు వేద ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం నిడదవోలు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో తనిఖీ నిర్వహించారు. పలు రికార్డులను పరిశీలించి కేసుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఐజీ అశోక్ కుమార్ విలేకర్లతో మాట్లాడుతూ జిల్లాలో ప్రత్యేక గస్తీని పెంచడంతో పాటు యువతకు కళాశాలల్లో కౌన్సెలింగ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఏదైనా సంఘటన జరిగితే పోలీసులు తక్షణం స్పందించి పరిష్కారం దిశగా పని చేసేలా అధికార్లకు సిబ్బందికి ఆదేశాలు ఇచ్చామన్నారు. జిల్లావ్యాప్తంగా కేసులకు సంబంధించి వాటి పురోగతిపై ప్రతివారం సమీక్ష చేస్తున్నామన్నారు. ప్రత్యేకంగా తూర్పుగోదావరి జిల్లా ఏజెన్సీని ఆనుకుని ఉండడంతో గంజాయిపై ప్రత్యేక దృష్టి సారించి నిఘా పెట్టామని తెలిపారు. ఒరిస్సా, వైజాగ్, ఏఎస్ఆర్ జిల్లాల పోలీస్ అధికారులు సమన్వయంతో గంజాయి రవాణాను నివారించేందుకు ఉక్కుపాదం మోపుతున్నామన్నారు. వారి వెంట అడిషనల్ ఎస్పీ ఎన్‌వీ. మురళీకృష్ణ, కొవ్వూరు డీఎస్పీ దేవ కుమార్, సీఐ తిలక్, ఎస్ఐలు శోభన్‌కుమార్, సతీష్ ఉన్నారు.

టైరు పేలి అదుపు తప్పి... లారీని ఢీకొన్న వ్యాన్

వ్యాన్ డ్రైవర్ మృతి


ప్రమాదంలో నుజ్జు నుజ్జు అయిన వ్యాన్


నరసింహులు (ఫైల్ ఫొటో)

నల్లజర్ల, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం దూబచర్లలో శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో అనంతపురం జిల్లా తాడిపర్తి మండలం చుక్కలూరు గ్రామానికి చెందిన శ్యామర్ల నరసింహులు(30) మృతిచెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. నరసింహులు అనంతపురం నుంచి రాజమహేంద్రవరానికి వ్యాన్‌లో దానిమ్మ కాయల లోడుతో వస్తున్నాడు. దూబచర్ల వద్ద వ్యాన్ ముందు టైరు పేలి అదుపు తప్పి డివైడర్ అవతల వైపు ఎదురుగా వస్తున్న లారీని ఢీకొంది. ఈ ఘటనలో డ్రైవర్ నరసింహులు అక్కడికక్కడ మృతిచెందగా వ్యాన్ నుజ్జునుజ్జు అయ్యింది. దానిమ్మకాయల లోడు రోడ్డుపై పడిపోవడంతో స్థానికులు కాయల కోసం ఎగబడ్డారు. కాగా నరసింహులుకు భార్య మహాలక్ష్మీ, కుమారుడు మనోజ్ ఉన్నారు. రాజమహేంద్రవరం వెళ్లి వస్తానని చెప్పి విగత జీవిగా పడి ఉండడంతో భార్య, బంధువులు కన్నీటి పర్యంతమయ్యారు. ఎస్ఐ సోమరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడేపల్లిగూడెం ఆసుపత్రికి తరలించారు.

గాడాలలో విజిలెన్స్ తనిఖీలు

రూ.5,28,271 విలువైన ఎరువులు సీజ్


గాడాలలో గొడౌన్‌ను తనిఖీ చేస్తున్న స్నేహిత

కోరుకొండ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ మండలం గాడాల గ్రామంలోని లక్ష్మీగణేష్ ట్రేడర్స్ ఫెర్టిలైజర్స్ షాపును శుక్రవారం రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ఎం.స్నేహిత ఆధ్వర్యంలో విజిలెన్స్, వ్యవసాయ శాఖ, లీగల మెట్రాలజీ అధికారులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా 8 ఎకరాల ఎరువుల్లో వ్యత్యాసం ఉండడం వల్ల షాపు యజమానిపై మండల వ్యవసాయాధికారి 6ఏ కింద కేసు నమోదు చేశారు. సుమారు రూ.4,85,271 విలువైన 21.900మెట్రిక్ టన్నుల ఎరువులను సీజ్ చేశారు. 10కిలోల వీనస్ సాయిల్, ఎఫ్7, సుప్రీం బ్యాగ్‌పై యూనిట్ విక్రయ లేకపోవడంపై లీగల్ మెట్రాలజీ అధికారులు రూ.43వేలు విలువై 40 బ్యాగులను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఈ షాపులో మొత్తం రూ.5,28,271 విలువ గల ఎరువులను సీజ్ చేశారు. ఈ సందర్భంగా స్నేహిత మాట్లాడుతూ రాజమహేంద్రవరం రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పరిధిలోని 3 జిల్లాల్లో ఎరువులు, విత్తనాలు, పురుగు మందు దుకాణాల్లో నిరంతరం తనిఖీలు కొనసాగుతాయన్నారు. గరిష్ఠ అమ్మకం ధర కంటే ఎక్కువ అమ్మినా, అక్రమ నిల్వలు కలిగి ఉన్నా, నకిలీ విత్తనాలు అమ్మినా, స్టాక్ రిజిస్టర్‌లు సక్రమంగా నిర్వహించకపోయినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ డీఎస్‌టీ తాతారావు, తహశీల్దార్ విజయ్‌కుమార్, లోవరాజు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన వైద్యం అందించాలి

కాకినాడ జీజీహెచ్ సూపరింటెండెంట్ లావణ్యకుమారి
ప్లాస్టిక్ సర్జరీపై రెండోరోజు రాష్ట్రస్థాయి సదస్సు


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న లావణ్యకుమారి

జీజీహెచ్ (కాకినాడ), డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): వైద్య రంగంలో నూతన మెళకువలను అందిపుచ్చుకుని నిష్ణాతులైన వైద్యనిపుణులుగా తీర్చిదిద్ది పేదలకు మెరుగైన వైద్యచికిత్సను అందించాలని కాకినాడ జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారి ఆకాంక్షించారు. అసోసియేషన్ ఆఫ్ ప్లాస్టిక్, రీకనస్ట్రక్టివ్ అండ్ ఈస్తటిక్ సర్జన్స్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అండ్ తెలంగాణ(ఏపీఆర్ఏఎస్‌సీఓన్)-2024 ఆధ్వర్యంలో జరుగుతున్న 21వ యాన్యువల్ సదస్సు రెండో రోజైన శుక్రవారం వివేకానంద పార్క్ ప్రాంగణంలోని ఫ్యాబిన్ కన్వెన్షన్ హాల్లో డాక్టర్ లావణ్యకుమారి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఏపీఆర్ఏఎస్‌సీఓన్ అధ్యక్షుడు డాక్టర్ డీవీ కృష్ణారావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ జీజీహెచ్ ప్లాస్టిక్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ బి.రత్నభూషణ్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ సదస్సులో ఎన్నో నూతన ఆవిష్కరణలకు తెరలేపి మెరుగైన వైద్యసేవలు అందించేందుకు కావాల్సిన నైపుణ్యతను, నూతన మెళకువలను క్షుణ్ణంగా తెలుసుకునేలా అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ సర్జరీలో కొత్తపు ఒతలు తొక్కుతున్న సాంకేతిక విధానాలను, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వివరించారు. శుక్రవారం జరిగిన సైంటిఫిక్ సెషన్‌కు దేశ నలుమూలల నుంచి వచ్చిన నిష్ణాతులైన ప్లాస్టిక్ సర్జరీ వైద్యనిపుణులు వైద్యులు, వైద్యవిద్యార్థులకు నాణ్యమైన వైద్యచికిత్స విధానంపై వివరించారు. సదస్సు అబ్జర్వర్ డాక్టర్ పీవీ సుధాకర్, జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్లు డాక్టర్ ఎంపీఆర్ విఠల్, డాక్టర్ శ్రీనివాసన్, ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శశి, ఫోరెన్సిక్ హెచ్‌వోడీ డాక్టర్ ఉమామహేశ్వరరావు, సర్జరీ విభాగాధిపతి డాక్టర్ ఎన్.శ్రీనివాస్, ఏపీఆర్ఏఎస్‌సీఓన్ ప్యాట్రన్ డాక్టర్ కె.విష్ణుమూర్తి, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎస్. ప్రవీణ్, కార్యదర్శి డాక్టర్ రాంబాబు పాల్గొన్నారు.

శస్త్రచికిత్సల స్పెషల్ బస్సు...2 రోజులు ఇక్కడే


శస్త్రచికిత్స పరికరాలను పరిశీలిస్తున్న వైద్యనిపుణులు

ప్రాథమిక శస్త్ర చికిత్స అంశాలపై వైద్యులు, వైద్యవిద్యార్థులకు శిక్షణను ఇచ్చేందుకు అత్యాధునిక వసతులతో కూడిన ప్రత్యేక బస్సు శుక్రవారం కాకినాడ రంగరాయ కళాశాల(ఆర్ఎంసీ)కు వచ్చింది. జీజీహెచ్, ఆర్ఎంసీల్లో వైద్యవిద్యను బోధిస్తున్న వైద్య నిపుణుల పర్యవేక్షణలో పోస్ట్‌గ్రాడ్యుయేషన్ విద్యార్థులకు, హౌస్‌సర్జన్‌లకు ఈ బస్సులో శిక్షణ ఇవ్వనున్నారు. ఈ ఆధునిక బస్సులో రకరకాల కుట్లకు సంబంధించిన శిక్షణ, లాపరోస్కోపిక్ ఆపరేషన్లకు సంబంధించిన శిక్షణ, ముఖ్యంగా పేగుల ఆపరేషన్‌లో ఉపయోగించే స్టాప్లర్‌లు అనే ప్రత్యేక పరికరాలకు శిక్షణ ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమాన్ని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారి, ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శశి ప్రారంభించారు. శుక్ర, శనివారాల్లో ఈ బస్సు ఆర్ఎంసీ ప్రాంగణంలో ఉండనున్నట్టు సూపరింటెండెంట్ తెలిపారు. సాధారణ, లాపరోస్కోపిక్, గైనకాలజీ, యూరాలజీ, పిడియాట్రిక్ సర్జరీల వైద్యులు, వైద్య విద్యార్థులకు శిక్షణ ఇస్తారని చెప్పారు.

కోతులు కూల్చిన ఇల్లు

భూకంపధాటికి బీటలువారిన రావి చెట్టు కొమ్మలు


కోతుల కారణంగా కూలిపోయిన ఇల్లు

కూనవరం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా కూనవరంలో బల్లా ఉమాదుర్గకు చెందిన ఇల్లు శుక్రవారం తెల్లవారుజామున వానరుల దండు కారణంగా కుప్పకూలింది. 2రోజుల క్రితం కూనవరంలో స్వల్పంగా భూకంపం వచ్చిన సంగతి తెలిసిందే. ఈ భూకంపంధాటికి కూనవరం పంచాయతీ దగ్గరలో ఉన్న ఓ భారీ రావిచెట్టు కొమ్మ బీటలు వారింది. సగం వరకు బీటలు వారడంతో అప్పటికే ఆ రావి చెట్టు కొమ్మ కిందపడిపోయే స్థాయిలో ఉంది. దీంతో శుక్రవారం తెల్లవారుజామున ఒక్కసారిగా వానరుల దండు ఆ రావిచెట్టు కొమ్మపై ఊగిసలాడడంతో వాటి బరువుకు ఆ కొమ్మ కిందపడిపోయింది. కొమ్మ కింద ఉమాదేవి ఇల్లు ఉండడంతో రేకులు, గోడలు కుప్పకూలిపోయాయి. ఉమాదేవి కుటుంబం ఆసుపత్రికివెళ్లడంతో ప్రమాదం తప్పింది.

టీడీపీ గ్రామశాఖ అధ్యక్షుడిపై బీరు బాటిల్‌తో దాడి


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వీర్రాజును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల

రాయవరం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): టీడీపీ గ్రామశాఖ అధ్యక్షుడు చుండ్రు వీర్రాజుపై గుర్తు తెలియని దుండగుడు బీరు బాటిల్‌తో దాడిచేసి పరారైన సంఘటన గురువారం రాత్రి రాయవరం మండలం చెల్లూరులో జరిగింది. టీడీపీ నేతలు తెలిపిన వివరాల ప్రకారం... పుష్ప-2 సినిమా రిలీజ్ సందర్భంగా గ్రామానికి చెందిన కొందరు వైసీపీ సానుభూతిపరులు పుష్ప-2 సినీ నటులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఫొటోతో కూడిన రెండు ఫ్లెక్సీలను గ్రామంలో ఏర్పాటు చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున రాజకీయ నాయకుల ఫ్లెక్సీలను ఎలా ఏర్పాటు చేస్తారని టీడీపీ నాయకుడు బవిరిశెట్టి అప్పారావు గ్రామ కార్యదర్శికి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో పోలీసుల సహకారంతో ఫ్లెక్సీలను తొలగించేందుకు అధికారులు, పోలీసు సిబ్బందితో వెళ్లారు. ఒక ఫ్లెక్సీ తొలగించడంతో రెండో ఫ్లెక్సీని తొలగించకపోవడంతో మరోసారి అధికారులు ఫ్లెక్సీ తొలగించేందుకు వెళ్లారు. పంచాయతీ గేటుకు సమీపంలో కూటమి నేతలతో మాట్లాడి బయటకు వెళ్తున్న గ్రామశాఖ అధ్యక్షుడి వీర్రాజుపై వెనుక నుంచి బీరు బాటిల్‌తో దాడి చేసి దుండగుడు తీవ్రంగా గాయపరిచాడు. వెంటనే సమీపంలో కూటమి నేతలు వీర్రాజు వద్దకు వచ్చేసరికి దూరంగా పక్క వీధిలో ఉన్న మరో వ్యక్తి బైక్‌పై దుండగుడు పరారయ్యాడు. రాయవరం ఎస్ఐ బుజ్జిబాబుకు విషయం తెలియడంతో సంఘటన స్థలానికి చేరుకుని దాడి సంఘటనపై ఆరా తీశారు. వీర్రాజును రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి కూటమి నేతలు తరలించారు. ఈ సంఘటనపై ఏరియా ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారంపై కేసు నమోదు చేసినట్టు స్థానిక ఎస్ఐ బుజ్జిబాబు తెలిపారు.

ఎమ్మెల్యే పరామర్శ

రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న టీడీపీ గ్రామశాఖ అధ్యక్షుడు చుండ్రు వీర్రాజును రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు పరామర్శించారు. విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు.

లైంగిక వేధింపులకు పాల్పడిన ఉపాధ్యాయుడి సస్పెన్షన్

ముమ్మిడివరం/పి.గన్నవరం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం నాగుల్లంక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సెకండ్ గ్రేడ్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న పిండి శ్రీనివాస్‌ను సస్పెండ్ చేసినట్టు జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీంబాషా తెలిపారు. పాఠశాలలో 3,4,5 తరగతులకు సంబంధించి ఆరుగురు విద్యార్థులపై అతడి లైంగిక వేధింపులపై ఈనెల 4వ తేదీన ఎంఈవో-1,2 కె.హెలీనా, సీహెచ్ వీరభద్రనందం విచారణ నిర్వహించారు. అనంతరం గ్రామస్తులు, బాధిత విద్యార్థుల తల్లిదండ్రులు, స్కూలు మేనేజ్‌మెంట్ సభ్యులు, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి, వివరాలు సేకరించారు. ఉపాధ్యాయుడు శ్రీనివాస్ లైంగిక వేధింపులకు పాల్పడినట్టు నిర్ధారించుకుని ఎంఈవో కె.హెలీనా నివేదిక ఇచ్చారు. ఆ నివేదిక ప్రకారం ఆ ఉపాధ్యాయుడిని 4వ తేదీ నుంచి విధుల నుంచి సస్పెండ్ చేసినట్టు జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీంబాషా పేర్కొన్నారు. అలాగే ఆ ఉపాధ్యాయుడిపై పోక్సో కేసు నమోదైందన్నారు.

వీరేశ్వరుని హుండీ ఆదాయం రూ.31 లక్షలు

ఐ.పోలవరం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం మురమళ్ల వీరేశ్వర స్వామి హుండీల ఆదాయం 280రోజులకు రూ.31,01,405 వచ్చినట్టు ఆలయ సహాయ కమిషనర్ మాచిరాజు లక్ష్మీనారాయణ తెలిపారు. రాజోలు కార్యనిర్వహణాధికారి ఎం.ప్రసాదరాజు పర్యవేక్షణలో లెక్కింపు జరిగింది. ప్రధాన హుండీ ద్వారా రూ.16,78,974, నిత్యకల్యాణం హుండీ ద్వారా రూ.12,25,944, వీరేశ్వరఅన్నదాన ట్రస్టు ద్వారా రూ.1,96,487 సమకూరినట్టు తెలిపారు. 48గ్రాముల బంగారం, 290గ్రాముల వెండి, 2 విదేశీ డాలర్లు వచ్చినట్టు తెలిపారు. ఆదాయాన్ని మురమళ్ల బ్యాంక్ ఆఫ్ బరోడాలో డిపాజిట్ చేశామన్నారు. కార్యక్రమంలో ట్రస్టుబోర్డు మాజీ చైర్మన్ కటారి నాని, దాట్ల ఇంద్రరాజు పాల్గొన్నారు.

వైసీపీ దొంగలకు భరోసా కల్పించేందుకే జగన్ యాత్ర

కాకినాడ నుంచి ప్రారంభిస్తే ద్వారంపూడి అక్రమాలు బయటకు
సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు ధ్వజం

కాకినాడ సిటీ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): వైసీపీ దొంగలకు భరోసా కల్పించేందుకే జగన్ యాత్ర చేపడుతున్నారని కాకినాడ సిటీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వనమాడి కొండబాబు ధ్వజమెత్తారు. కాకినాడ జిల్లా టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో పథకం ప్రకారమే బియ్యం మాఫియా రెచ్చిపోయిందన్నారు. అప్పటి ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ఎన్నో అక్రమాలు, అరాచకాలకు పాల్పడ్డారన్నారు. అవి ఇప్పుడు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయన్నారు. ద్వారంపూడి చేసిన అక్రమాలను నాడు ఆరోపించిన తాము ఇప్పుడు ఆధారాలతో సహా సంబంధిత అధికారులకు అందించామన్నారు. కాకినాడ పోర్టు నుంచి రేషన్ బియ్యం అక్రమంగా తరలించడంలో అప్పటి సీఎం జగన్‌రెడ్డి సహకారంతో చంద్రశేఖరరెడ్డి ఎమ్మెల్యేగాను, భాస్కరరెడ్డి పౌరసరఫరాలశాఖ చైర్మన్‌గాను, వీరభద్రారెడ్డి రాష్ట్ర రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగాను రేషన్‌బియ్యం మాఫియా నడిపారన్నారు. మాజీ సీఎం జగన్ వైసీపీకి చెందిన దొంగలకు భరోసా కల్పించేందుకే యాత్ర చేపడుతున్నారని, కాకినాడ నుంచి ప్రారంభిస్తే ద్వారం పూడి అక్రమాలు బయటకు వస్తాయన్నారు. నాడు బియ్యం వ్యాపారంలో తాము కింగులం అన్న ద్వారంపూడి నేడు చాలా చిన్నవాళ్లమని చెప్పి బేలతనాన్ని ప్రదర్శిస్తున్నారన్నారు. అక్రమాలకు ఉపయోగించుకున్న కాకినాడ పోర్టు పేరు ప్రఖ్యాతలను తిరిగి నిలబెడతామని కొండబాబు చెప్పారు.

కృష్ణా జిల్లాకు... క్యూ కట్టిన లారీలు

వెయ్యిమెట్రిక్ టన్నుల ధాన్యం లోడింగ్ చేసుకుని కాకినాడ జిల్లాకు నేడు రాక

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా నుంచి 45 లారీలు శుక్రవారం కృష్ణా జిల్లాకు బయలుదేరి వెళ్లాయి. అక్కడి నుంచి వెయ్యి మెట్రిక్ టన్నుల ధాన్యం లోడింగ్ చేసుకుని శనివారం కాకినాడకు చేరుకోనున్నాయి. కృష్ణా జిల్లాలో ప్రభుత్వం ఆధ్వర్యంలో జరుగుతున్న ధాన్యం సేకరణకు మంచి స్పందన లభించింది. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వేల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చి చేరుతుంది. దీంతో అక్కడ నిల్వ చేయడం కష్ట సాధ్యంగా మారింది. దీంతో కృష్ణాజిల్లాలో సేకరించిన ధాన్యాన్ని కాకినాడ జిల్లాకు తరలించాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో ధాన్యం తరలింపు కార్యక్రమాన్ని పర్యవేక్షించాలని కాకినాడ అధికారులకు ఆదేశించారు. దీంతో కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్, జేసీ రాహుల్‌మీనా, జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ దేవుల నాయక్, ఆర్డీవో మల్లిబాబుల ఆధ్వర్యంలో ధాన్యం తీసుకొచ్చేందుకు జిల్లాలో మిల్లర్లకు సమాచారం అందించారు. ఈ నేపథ్యంలో ఇప్పటివరకు మిల్లర్లు 45 లారీలను కృష్ణాజిల్లాకు పంపించారు. ఒక్కొక లారీలో 20మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం లోడింగ్ చేసుకుని శనివారం కాకినాడకు రానున్నాయి. ఈ ధాన్యం కాకినాడ జిల్లాలో వివిధ సీఎంఆర్ మిల్లుల్లో మిల్లింగ్ చేసుకుని బియ్యంను జిల్లాలో పౌరసరఫరాల సంస్థ గొడౌన్లలో నిల్వ చేస్తారు. మరో 2 రోజుల పాటు జిల్లానుంచి లారీలు కృష్ణా జిల్లాకు పయనం కానున్నారు.

'అస్సాగో ఇథనాల్ పరిశ్రమను వెంటనే సీజ్ చేయాలి'



రంపయర్రంపాలెంలో నిరసన తెలుపుతున్న రైతు కూలీ సంఘం సభ్యులు

గోకవరం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): గోకవరం మండలం గుమ్మళ్ళదొడ్డి గ్రామంలో ఏర్పాటుచేసిన అస్సాగో ఇథనాల్ పరిశ్రమ అనుమతులు రద్దు చేసి, వెంటనే సీజ్ చేయాలని డిమాండ్ చేస్తూ రంపయర్రంపాలెంలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నా కుల వీరాంజనేయులు మాట్లాడుతూ పరిశ్రమ వల్ల వెలువడయ్యే విష వాయువుల వల్ల సమీపంలో ఉన్న గుమ్మళ్ళదొడ్డి, అచ్యుతాపురం, బావాజీపేట, వెదురుపాక గ్రామాల ప్రజలు అనారోగ్యం పాలవుతూ ప్రాణాలు కోల్పోయే పరిస్థితుల్లో ఉన్నారని.. ఈ విషయంలో ప్రభుత్వం, అధికారులు మామూళ్ల మత్తులో ఉన్నారని విమర్శించారు. పరిశ్రమకు సీజ్ చేయాలని లేకపోతే జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సతీష్, నాయకులున్నారు.

పరిశ్రమకు వ్యతిరేకంగా పోస్టర్లు

గుమ్మళ్ళదొడ్డిలో ఇథనాల్ పరిశ్రమకు వ్యతిరేకంగా శుక్రవారం గోడలపై పోస్టర్లు వెలిశాయి. పోలీసులు పంచాయితీ అధికారుల సహకారంతో వాటిని తొలగించారు. 144 సెక్షన్ అమల్లో ఉన్నందున ఎటువంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలు చేపట్టరాదంటూ హెచ్చరికలు జారీ చేశారు.

జీజీహెచ్ మేనేజర్ సస్పెండ్‌కు సిఫార్సు చేసిన కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): కాకినాడ జీజీహెచ్ మేనేజర్ నరసింగరావును సస్పెండ్ చేయాలని కోరుతూ కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ శుక్రవారం ఒక నివేదికను వైద్యఆరోగ్యశాఖ రీజనల్ డైరెక్టర్‌కు పంపించారు. 2020-21లో కొవిడ్ సమయంలో నర్సుల పోస్టుల నియామకాల్లో మెరిట్‌ను పాటించకుండా పోస్టులు నింపారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఆస్పత్రిలో 278 నర్సుల పోస్టుల భర్తీలో పలువురు అనర్హులకు పోస్టింగులు ఇచ్చిన నేపథ్యంలో రాజమహేంద్రవరానికి చెందిన రాజీవ్‌వర్మ ఇచ్చిన ఫిర్యాదుతో అక్టోబరు 24న విచారణ కమిటీని నియమించారు. ఈ వ్యవహారంపై విచారణ పూర్తిచేసిన కమిటీ తమ నివేదికను గతనెల 7న కలెక్టర్ షాన్‌మోహన్‌కు అందజేశారు. అవకతవకలు నిర్ధారణ కావడంతో గతనెల 26న జీజీహెచ్ మేనేజర్‌కు మెమో జారీ చేశారు. అక్రమాలు నిర్ధారణ అయిన నేపథ్యంలో చర్యలు ఎందుకు తీసుకోకూడదో వివరణ ఇవ్వాలని కోరారు. మేనేజర్ ఇచ్చిన వివరణ సంతృప్తికరంగా లేకపోవడంతో కలెక్టర్ శుక్రవారం అతడ్ని సస్పెండ్ చేయాలని సిఫార్సు చేశారు.

విద్యుత్ ఉచ్చులో పడి 6 ఆవులు, 2 ఎద్దులు మృతి

అడ్డతీగల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అడ్డతీగల మండలం అనిగేరు సమీపంలో అటవీ ప్రాంతంలో దుండగులు అడవి జంతువుల వేట కోసం అక్రమంగా ఏర్పాటు చేసిన విద్యుత్ ఉచ్చులో పడి ఒకే రైతుకు చెందిన 6 ఆవులు, 2 ఎద్దులు మృతి చెందాయి. అనిగేరు గ్రామానికి చెందిన ముర్ల అబ్బాయిరెడ్డికి చెందిన మొత్తం పశువులు ఈ ఘటనలో మృతి చెందడంతో ఆ కుటుంబం తీవ్ర ఆవేదన చెందుతోంది. దీనిపై బాధితుడు శుక్రవారం అడ్డతీగల పోలీసులకు ఫిర్యాదు చేశాడు.


మృతిచెందిన మూగ జీవాలు

జేఎన్టీయూకేలో... డ్రోన్ డవలప్‌మెంట్‌పై వర్క్‌షాప్

జేఎన్టీయూకే, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూకేలోని సెనేట్ హాల్లో డ్రోన్ డెవలప్‌మెంట్ అనే అంశంపై ఐటీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డైరెక్టరేట్ ఆధ్వర్యంలో శుక్రవారం ట్రాన్‌టిక్ ల్యాబ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సహకారంతో వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న వీసీ కేవీఎస్‌జీ మురళీకృష్ణ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఏపీని భారతదేశానికి డ్రోన్ రాజధానిగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో పనిచేస్తున్నారన్నారు. డ్రోన్ టెక్నాలజీపై విద్యార్థులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. కార్యక్రమంలో సీఈ వి.శ్రీనివాసులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



వర్క్‌షాప్‌లో పాల్గొన్న వీసీ మురళీకృష్ణ

రాజమహేంద్రవరం

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి

అసౌకర్యం కలుగకుండా దర్శనం కల్పించాలి



షష్ఠి పనులపై కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

● ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి
● బిక్కవోలులో షష్ఠి ఏర్పాట్ల పరిశీలించిన నల్లమిల్లి

బిక్కవోలు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి):తెలుగు రాష్ట్రాల్లో పేరొందిన బిక్కవోలు షష్ఠికి లక్షకు పైగా భక్తులు వస్తారని వీరికి ఎటువంటి అసౌకర్యం కలుగకుండా స్వామి దర్శనాలు కల్పించాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. షష్ఠి ఉత్సవ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పల్లి శ్రీనివాసరెడ్డి పనులు పూర్తయ్యాయని, శనివారం తెల్లవారుజామున 1.20లకు తీర్థపు బిందె సేవతో షష్ఠి ఉత్సవం ప్రారంభిస్తామని, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా స్వామి దర్శనాలకు మూడు క్యూలైన్లు ఏర్పాటు చేశామని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా తాను ప్రత్యక్షంగా పాల్గొన లేకపోతున్నానని ఎమ్మెల్యే అన్నారు. అధికారులు, పోలీసులు ఉత్సవ కమిటీ సమన్వయంతో పనిచేసి ఉత్సవాలను విజయవంతం చేయాలన్నారు. ముందుగా ఆయన సుబ్రహ్మణ్యస్వామిని దర్శించుకుని పూజలు జరిపారు. ఈయన వెంట రావాడ నాగు, చాగంటి సాయిబాబారెడ్డి, పాలచర్ల శివప్రసాద్‌చౌదరి, గుణ్ణం రమేష్‌చౌదరి, నందిపాటి కిషోర్‌కుమార్‌రెడ్డి, కె.శ్రీనివాస్ ఉన్నారు.

హామీలు గుప్పించి అధికారంలోకి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న విశ్వేశ్వరరెడ్డి

మాజీ సీఎం జగన్‌పై డీసీసీ అధ్యక్షుడు విశ్వేశ్వరరెడ్డి విమర్శ

రాజానగరం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : అధికారంలోకి రాకముందు విద్యుత్ చార్జీలు పెంచమని చెప్పి హామీలు గుప్పించి, అధికారంలోకి వచ్చాక మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి రూ.33 కోట్లు విద్యుత్ ఛార్జీలు పేరుతో ప్రజలపై మోయలేని భారం మోపారని డీసీసీ అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి ప్రశ్నించారు. రాజానగరం పంచాయతీ పరిధిలోని సూర్యారావుపేట డాక్టర్ వడయార్స్ ఆసుపత్రి ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అదానీతో చేతులు కలిపి విద్యుత్‌కు సంబంధించి మాజీ సీఎం జగన్ రూ.1750 కోట్లు అవినీతికి పాల్పడ్డారని దుయ్యబట్టారు. అలాగే 2019-20లో బీటీయే, పీజీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తానని హామీ ఇచ్చి పూర్తిస్థాయిలో చెల్లించలేదన్నారు. వైఎస్సార్ మానస పుత్రిక షర్మిల భవిష్యత్తులో ముఖ్యమంత్రి కావడం తథ్యమన్నారు. తొలుత స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. సమావేశంలో పీసీసీ ఉపాధ్యక్షుడు మార్టిన్ లూథర్, డాక్టర్ వైఏ వడయార్, ఎల్లా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఓబీసీ సర్టిఫికెట్ ఇబ్బందులు తొలగించండి

తూర్పుకాపు సంఘం నేత రాంబాబు

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): అధికారులు మారినప్పుడల్లా తూర్పుకాపుల కులధ్రువీకరణ పత్రాలు విషయంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తూర్పుకాపు విద్యవిజ్ఞాన అభివృద్ధి సంస్థ కార్యదర్శి మజ్జి రాంబాబు అన్నారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. తూర్పుకాపులు అంటే విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకే పరిమితం చేయవద్దన్నారు. తూర్పుకాపులు రాష్ట్ర మంతా ఉన్నారని చెప్పారు. రాష్ట్రంలో తహశీల్దార్లు బదిలీలైన ప్రతిసారి తూర్పుకాపుల కులధ్రువీకరణ పత్రాల విషయంలో సంఘీయులు చాలా ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. చాలా మంది అధికారులకు అవగాహన లేక ఓబీసీ సర్టిఫికెట్ జారీ విషయంలో ఇబ్బంది పెడుతున్నారని చెప్పారు. ఈ సమస్యను కేంద్రమంత్రి రామ్మోహననాయుడు దృష్టికి తీసుకువెళ్తామన్నారు.ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు చింతా జోగినాయుడు, పోలాకి పరమేష్, రుంకాని విజయ్, శనపతి సత్తిబాబు, అరుగు ధన్‌రాజ్, మీసాల నాగమణి, యడ్ల సాయమ్మ, అల్తి లోకేష్, టి.నాగరాజు, జి.అప్పారావు, అట్టాడ రవి, అట్టాడ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నేడు టీచర్స్, పేరెంట్స్ పండుగ

గోపాలపురం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యో తి): రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు మం డలంలో ఆయా పాఠశాలల్లో శనివారం నిర్వహించే పేరెంట్స్ టీచర్స్ సమావేశానికి ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు సర్వం సిద్ధం చేశారు. పాఠశాలలను జెండాలతో అలంకరించి ఆవరణ చుట్టూ పారిశుధ్య పనులు నిర్వహిం చారు. పాఠశాలల్లో తల్లిదండ్రులకు పోటీలు నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశారు. విజేతలకు బహుమతులు అందజేయనున్నారు.

దార్శనికుడు అంబేడ్కర్

» నన్నయ వర్సిటీ వీసీ శ్రీనివాసరావు
» రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ వర్ధంతి
» నివాళులర్పించిన ప్రజాప్రతినిధులు, నాయకులు
» పలుచోట్ల సేవా కార్యక్రమాలు

దివాన్‌చెరువు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): సమసమాజ నిర్మాణ దార్శనికుడు అంబేడ్కర్ అని ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు అన్నారు.రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ వర్థంతిని శుక్రవారం పలుచోట్ల ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నన్నయ వర్సిటీ ప్రాంగణంలోని అంబేడ్కర్ విగ్రహానికి వీసీ శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, అధ్యాపకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రాజానగరం: అంబేడ్కర్ వర్ధంతిని సీపీఐ ఎం ఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో రాజానగరం, సూర్యారావుపేటలో నిర్వహించారు. అఖిల భారత రైతుకూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు జె.సత్తిబాబు మాట్లాడుతూ భారతదేశంలో పీడిత కులాలకు రాజ్యాంగం ద్వారా అంబేడ్కర్ అనేక హక్కులను కల్పించారన్నారు. రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో తుమ్మల కళావతి, దొమ్మ సీత, మార్గాని సత్యవతి, బొల్లి అరవాలమ్మ, తామర్ల గౌరి పాల్గొన్నారు. గైట్ డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.వల్లీమాధవి మాట్లాడుతూ ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత దేశానికి పటిష్టమైన రాజ్యాంగాన్ని అందించిన మహనీయుడు అంబేడ్కర్ అని కొనియాడారు. ఆయన చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగాధిపతి సీహెచ్ వెంకటేశ్వర్లు, ఎన్‌ఎస్‌ఎస్ పీవో కె.కాళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కడియం: కడియం ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆర్పీఏ జిల్లా కన్వీనర్ దామిశెట్టి నాగరాజు, హెచ్‌ఎం టి.సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. పొట్టిలంకలో జరిగిన కార్యక్రమంలో బొజ్జా తారకం-రిపబ్లికన్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కా వెంకటరత్నరాజు మాట్లాడుతూ మహామేధావి అంబేడ్కర్ అన్నారు. కార్యక్రమంలో కోనాల లాజరు, బడుగు సత్తిబాబు పాల్గొన్నారు. జేగురుపాడులో సర్పంచ్ యాదల స్టాలిన్ మాట్లాడుతూ ప్రపంచ దేశాల్లో మేధావిగా గుర్తింపు పొందిన గొప్ప నాయకుడు అంబేడ్కర్ అన్నారు. కార్యక్రమంలో ఆకుల సుధాకర్, నాగిరెడ్డి శివాజీ, పాలపర్తి ప్రకాష్, సాకా కిరణ్, బళ్ల అన్నవరం పాల్గొన్నారు.

రంగంపేట: రంగంపేటలో కూటమి నాయకులు ఉండవిల్లి గిరిబాబు, మైలవరపు సాయిరాం, మండవిల్లి గుప్త, గారపాటి రాంబాబు, యలమాటి రాంబాబు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పించారు. అంబేడ్కర్ అందరికీ ఆదర్శప్రాయుడని అన్నారు. వడిశలేరులో మాజీ సర్పంచ్ పసల గగారిన్, మాలమహానాడు జిల్లా జాయింట్ సెక్రటరీ పోతుల చెల్లయ్య, వజ్రరావు నివాళుర్పించి అంబేడ్కర్ సేవలను కొనియాడారు. ఎస్సీరాజాపురం, జి.దొంతమూరు, మర్రిపూడి, నల్లమిల్లి, గ్రామాల్లో అంబేడ్కర్ వర్ధంతిని నిర్వహించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

సీతానగరం: ఇనుగంటివారిపేట అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. యూత్ సభ్యులు గాడి రవికుమార్, బట్టు వెంకటరాజు, వందే రవితేజ, చింతపల్లి సునీల్, గాడి ప్రవీన్‌కుమార్ మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా ప్రతిఒక్కరు నడుచుకోవాలన్నారు.

అనపర్తి: మండలంలోని రామవరం, అనపర్తి గ్రామాల్లో అంబేడ్కర్ విగ్రహాలకు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. రాజ్యాంగాన్ని గౌరవించడం ద్వారా ఆయనను గౌరవించాలన్నారు. అనపర్తి కెనాల్ రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తి వెలిగించి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిరసపల్లి నాగేశ్వరరావు, సత్తి దేవదానరెడ్డి, కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, కర్రి వెంకటరామారెడ్డి, రావాడ నాగు, ఒంటిమి సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం సిటీ/కల్చరల్: భవిష్యత్ తరాలు బాగుకు ముందు చూపుతో రాజ్యాంగాన్ని రచించిన మహనీయుడు అంబేడ్కర్ అని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. అంబేడ్కర్ వర్ధంతిని ఎస్సీఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నేతలు తాళ్ళూరి బాబు రాజేంద్రప్రసాద్, కోరుకొండ చిరంజీవి నిర్వహించారు. రాజమహేంద్రవరం కార్పొరేషన్ కార్యాలయం ముందున్న అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు. తిలక్‌రోడ్‌లోని వైసీపీ కార్యాలయంలో డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గోకవరం బస్టాండ్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలే సామాజిక చైతన్య వ్యవస్థాపక అధ్యక్షుడు నయనాల కృష్ణారావు పూలమాలవేశారు. కార్పొరేషన్ కార్యాలయం ప్రాంగణంలో అంబేడ్కర్ విగ్రహానికి కమిషనర్ కేతన్‌గార్గ్ నివాళులర్పించారు. గోకవరం బస్టాండ్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి బీసీ సంక్షేమ సంఘం మహిళా విభాగం జాతీయ అధ్యక్షురాలు డాక్టర్ అనుసూరి పద్మలత పూలమాలలు వేసి నివాళులర్పించారు. కంబాలచెరువు ఎస్‌బీఐ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్‌లో అంబేడ్కర్ చిత్రపటం వద్ద డీజీఎం ప్రమోద్‌కుమార్ మిశ్రా నివాళులర్పించారు. కాతేరు మల్లయ్యపేట సెంటర్‌లో వీవీ నగర్ అంబేడ్కర్ యువజన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అంబేడ్కర్ విగ్రహానికి ఏపి మానవహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముప్పాళ్ళ సుబ్బారావు పూలమాలలువేసి నివాళులర్పిచారు. రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో నన్నయ వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.సుధాకర్ అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాశి నవీన్‌కుమార్, చాపల చిన్నరాజు, బొమ్ముల దత్తు, రేలంగి శ్రీదేవి, కురగంటి సతీష్, దారా యేసురత్నం, కప్పల వెలుగు, తురకల నిర్మల, మోతా నాగలక్ష్మి, మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, మజ్జి అప్పారావు,వాకచర్ల కృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



రాజానగరంలో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న దృశ్యం



రంగంపేటలో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న దృశ్యం



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వాసు

13న బీఈడీ స్పాట్ అడ్మిషన్స్

రాజమహేంద్రవరం కల్చరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ట్రైనింగ్ కాలేజీలో ఈ నెల 13న బీఈడీ స్పాట్ అడ్మిషన్స్ నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ తెలిపారు. ప్రభుత్వ ట్రైనింగ్ కాలేజీలో 2024-25 విద్యా సంవత్సరానికి కన్వీనర్ కోటాలో బీఈడీ సీట్లకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఎడ్‌సెట్-24 నందు ఉత్తీర్ణత పొందినవారు అర్హులన్నారు. వివరాలకు సెల్ 9395381133 సంప్రదించాలన్నారు.

ముగిసిన రైల్వే కార్మిక సంఘాల ఎన్నికలు

రాజమహేంద్రవరం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రైల్వే కార్మిక సంఘాల ఎన్నికలు శుక్రవారంతో ముగిశాయి. 4వ తేదీన పోలింగ్ జరిగినా లోకోపైలట్ల కోసం 4,5,6 తేదీల్లో మూడు రోజులు ఓటు వేసే అవకాశం కల్పించారు. సౌత్‌సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ (ఎస్‌సీఆర్‌ఎంయూ), సౌత్‌సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ (ఎస్‌సీఆర్‌ఈఎస్), దక్షిణమధ్య రైల్వే కార్మిక సంఘ్(డీఎంఆర్‌కేఎస్)లు ఎన్నికల్లో పాల్గొన్నాయి. ఈ యూనియన్లలో 30శాతం పైగా ఓటింగ్ సాధించిన సంఘాన్ని రైల్వే శాఖ గుర్తిస్తుంది. ఉద్యోగులకు సంబంధించి వారితో చర్చలు జరుపుతుంది. లోకోపైలట్లు సుమారు 1400 గార్డులు, ఏఎస్‌ఎం, పాయింట్స్‌మెన్, ఎలక్ట్రికల్, సిగ్నల్ విభాగాలకు చెందిన 900, ఇంజనీరింగ్ విభాగానికి చెందిన 515 మంది ఉద్యోగులు ఓట్లు కలిగి ఉన్నారు. 12న ఫలితాలు వెలువడనున్నాయి. కోర్టులో కేసులు ఉండడం వల్ల 2013 నుంచీ ఈ సంఘాలకు ఎన్నికలు జరగకపోవడం గమనార్హం. పదేళ్ల తర్వాత ఎన్నికలు హోరాహోరీగా జరిగాయి.

కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక సాయం

అనారోగ్యానికి గురయిన కానిస్టేబుల్ కుటుంబానికి 2009 బ్యాచ్ కానిస్టేబుల్స్ రూ.లక్ష ఆర్థికసాయం అందజేశారు. నిడదవోలు పోలీస్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న టి.రాజేష్ అనారోగ్యానికి గురయ్యాడు. రాజమహేంద్రవరంలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. 2009 బ్యాచ్ సివిల్ కానిస్టేబుల్స్ అందరూ కలసి సహాయ ఫౌండేషన్‌గా ఏర్పడి శుక్రవారం రూ.లక్ష నగదును రాజేష్ కుటుంబ సభ్యులకు అందజేశారు.

తప్పుగా ప్రవర్తిస్తే ధైర్యంగా తిరగబడండి

మీ భద్రత మా బాధ్యత సభలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మహిళలు, బాలికల పట్ల తప్పుగా ప్రవర్తిస్తే ధైర్యంగా తిరగబడాలని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. రాజమహేంద్రవరం ఆదిత్య డిగ్రీ కళాశాలలో శుక్రవారం సాయంత్రం జరిగిన మీ భద్రత మా బాధ్యత సభలో ఆయన మాట్లాడారు. గత పాలకుల వల్ల ఎన్నో దారుణాలు జరిగాయన్నారు. కూటమి ప్రభుత్వం మహిళల రక్షణకు కట్టుబడి ఉందన్నారు.రాజమహేంద్రవరాన్ని గడచిన ఐదు సంవత్సరాల్లో డ్రగ్స్ రాజధానిగా మార్చేశారన్నారు. ఎక్కడ గంజాయి దొరికినా దాని మూలాలు రాజమహేంద్రవరంలో ఉండేవన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పరిస్థితిలో మార్పు వచ్చిందన్నారు. మహిళా రక్షక్ ఏర్పాటు చేశామని, ఐదు నెలల్లో 70 శాతం పరిస్థితి అదుపులోకి తెచ్చామని చెప్పారు. నగరంలో 60 మందిపై గంజాయి కేసులు నమోదు చేసినట్టు చెప్పారు. సమావేశంలో మహిళా రక్షక్ ఎస్‌ఐ, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కా దేవి వరప్రసాద్ , విద్యార్థినులు పాల్గొన్నారు.

షష్ఠి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

● ఐదు రోజులపాటు ఉత్సవాల నిర్వహణ ● భక్తుల దర్శనానికి ప్రత్యేక బారికేడ్లు



రాజానగరంలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

రాజానగరం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రాజానగరంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి 98వ షష్ఠి ఉత్సవాలు నేటి నుంచి 11 వరకు నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ పూర్తి చేసింది. రాజమహేంద్రవరానికి చెందిన తోట సత్యనారాయణ మూర్తి దంపతుల చేతుల మీదుగా ప్రతిష్ఠించబడిన ఈ ఆలయం 98 వసంతాలు పూర్తి చేసుకుంటోంది. శనివారం ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరగనున్నాయి. సాయంత్రం స్వామివారి కల్యా ణం నిర్వహించనున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఉత్సవ కమిటీ అన్ని చర్యలు చేపట్టింది.

షష్ఠి చూసొద్దాం

కోరుకొండ: కోరుకొండ సుబ్రహ్మణ్యేశ్వర షష్ఠి ఉత్సవాలు తెల్లవారుజామున ప్రారంభం కానున్నాయి. షష్ఠి ఉత్సవాల సందర్భంగా స్వామివారి దర్శనాలకు సంబంధించి దర్శనం టిక్కెట్లు విక్రయించేందుకు రూ.3.50 లక్షలకు పాట దక్కించుకున్నారు. ఆరు రోజులపాటు ఈ ఉత్సవాలు వైభవంగా నిర్వహించనున్నారు.

సీతానగరం: సీతానగరం మండలం ముగ్గళ్ళ, సీతానగరం ఆలయాల్లో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి కళ్యాణాన్ని జరిపారు. శుక్రవారం రాత్రి 7 గంటలకు సీతానగరం శివాలయంలో ఉన్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణంలో వలవల వల్లి, ఉదర్సిని దంపతులు పాల్గొనగా ఆలయ అర్చకులు కొడమంచిలి రాంబాబు కల్యాణం జరిపారు. ముగుళ్ల శివాలయంలో దేవదాయ ధర్మదాయశాఖ ఈవో పాటి సత్యనారాయణ ఆధ్వర్యంలో అర్చకులు కొడమంచిలి ఉపమాస్వామి విజయ్ కుమార్, వినేష్ కుమార్ స్వామి వారికి కల్యాణం జరిపారు. అనంతరం స్వామివారిని భక్తుల దర్శనార్థం అలంకరించారు.



సీతానగరంలో సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

పేరెంట్స్, టీచర్స్ సమావేశాలకు సర్వం సిద్ధం

కోరుకొండ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని 55 ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం జరగనున్న మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌కు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మండల విద్యాశాఖాధికారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు ఈ సమావేశం జరుగుతుందన్నారు. ఇందుకు సంబంధించి పేరెంట్స్ కమిటీ విద్యార్థులతో ఆహ్వాన పత్రికలను విద్యార్థుల తల్లిదండ్రులకు అందజేశామన్నారు. ఈ సమావేశం మొదటిసారిగా విద్యార్థుల తల్లిదండ్రులకు విద్యార్థుల ప్రగతికి సంబంధించిన ప్రోగ్రెస్ కార్డుల ద్వారా విద్యార్థుల ప్రగతిని పాఠశాల అభివృద్ధి పేరెంట్స్‌తో చర్చిస్తామన్నారు. పాఠశాల ఆవరణలో పేరెంట్స్ కమిటీ, ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి తిధి భోజనం చేసేలా ఏర్పాట్లు చేశామన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల విద్యాశాఖాధికారులు టి.కుశలవ దొర, ఎం.సుజాత, ఒక ప్రకటనలో తెలిపారు.

1900 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

రాజానగరం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా డీపీఈవో లక్ష్మీలావణ్య ఆదేశాల మేరకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ రాజమహేంద్రవరం సౌత్ స్టేషన్ బృందం నాటుసారా బట్టీలపై శుక్రవారం దాడులు జరిపారు. దీనిలో భాగంగా చక్రద్వారబంధం రిజర్వ్ ఫారెస్టులో సాగుతున్న నాటుసారా బట్టీలపై దాడులు జరిపి 1900 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ పోలీసులు తెలిపారు.

మెగా పిటీఎంలో విద్యార్థులకు హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులు

దివాన్‌చెరువు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం శనివారం నిర్వహించనున్న తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మెగా సమావేశానికి సంబంధించి అధికారులు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇందులో భాగంగా పలు సూచనలు, సలహాలు సంబంధిత ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు ఉపాధ్యాయులకు అందజేస్తున్నారు. ఈ మెగా పిటీఎంలో విద్యార్థులకు సంబంధించి హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డు (సమగ్ర ప్రగతి పత్రం) కూడా విద్యార్థుల తల్లిదండ్రులకు అందజేస్తారు. సమావేశానికి హాజరైన విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో బాటు సమావేశంలో పాల్గొన్న వారంతా ప్రతిజ్ఞ చేస్తారు.

నేటి నుంచి సుబ్రహ్మణ్య షష్ఠి

రాజమహేంద్రవరం కల్చరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కోరుకొండ రోడ్డు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్ఠి ఉత్సవాలు నేటి నుంచి 11 వరకు జరుగుతాయని ఆలయ ధర్మకర్తలు ఇసుకపల్లి సుబ్రహ్మణ్యం, ఇసుకపల్లి శ్రీనివాస్ తెలిపారు. తెల్లవారుజామున 2.30 గంటలకు రుద్రాభిషేకం, సాయంత్రం అయ్యప్ప స్వామి మహాపడి పూజ జరుగుతుందన్నారు.

రేపు షిర్డీసాయి విద్యా సంస్థల అవగాహన సదస్సు

రాజమహేంద్రవరం రూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): పదో తరగతి చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులకు శ్రీషిర్డీసాయి విద్యా సంస్థల ఆధ్వర్యంలో అవగాహన సదస్సు, మెగా స్కాలర్‌షిప్ టెస్టు నిర్వహిస్తున్నట్లు విద్యా సంస్థల డైరెక్టర్ శ్రీవిద్య తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటలకు దివాన్‌చెరువు బీజాపూరి క్యాంపస్‌లో సదస్సు జరుగుతుందన్నారు. ఇంటర్మీడియట్‌తో పాటు జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్, నీట్, ఏయిమ్స్ ఐపీమాట్, క్లాట్, సివిల్స్ వంటి ఇంటిగ్రేటెడ్ కోర్సులపై నిపుణులు అవగాహన కల్పించి సందేహాలను నివృత్తి చేస్తారన్నారు. అనంతరం ఇంటర్‌లో ఐఐటీ ఓరియంటేషన్ కోర్సుకు ఎల్-సాట్, నీట్ ఓరియంటేషన్ కోర్సుకు ఎం-సాట్, సివిల్స్ ఓరియేంటేషన్ కోర్సుకు డీ-సాట్ విభాగాల్లో పరీక్ష నిర్వహించి అర్హులందరికీ స్కాలర్‌షిపు అందించనున్నట్లు శ్రీవిద్య తెలిపారు. ఈ అవకాశాన్ని పదో తరగతి విద్యార్థులు సద్వినియోగపరుచుకోవాలని విద్యా సంస్థల చైర్మన్ తంబాబత్తుల శ్రీధర్ పేర్కొన్నారు. వివరాలకు 95812 61119లో సంప్రదించాలన్నారు.

జనరల్ నోటీసు

మహారాజశ్రీ రాజమహేంద్రవరం సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో

S.O.P.No.21/2024

Between:

1. గుళ్ళ నవ్య, W/o late చిట్టిరాజు, 27 సంIIలు, హౌస్‌వైఫ్, డోర్ నెం. 4-60, వేములపల్లి, మండపేట మండలం, ఆలమూరు ... JCJC
2. గుళ్ళ అక్షయకుమార్, S/o late చిట్టిరాజు, 8 సంIIలు, స్టూడెంట్, డోర్ నెం.4-60, వేములపల్లి, మండపేట మండలం, ఆలమూరు ... JCJC

(The 2nd Petitioner being minor reprasented by his Nature Guardian-Mother by name Gulla Navya, Who is the 1s Petitioner)

- పిటీషనర్స్

And

మేనేజర్, ITC అగ్రిబిజినెస్, అనపర్తి అనపర్తి మండలం, అనపర్తి JCJC - రెస్పాండెంట్

పై నెంబరు దావా గ్రంథములనురు సంబంధించి పిటీషనర్స్ పేరున Succession Certificate late గుళ్ళ చిట్టిరాజు గారి వారసులుగా ఇప్పించవలసి కోరుచూ పిటిషన్ దాఖలు చేసినారు. సదరు late గుళ్ళ చిట్టిరాజు గారి తాలూకు రావలసిన మొత్తం మేనేజర్, ITC అగ్రిబిజినెస్, అనపర్తి వారి వద్ద కలవు.

దీనికి సంబంధించి దివి.09-12-2024 వాయిదాగా అయిఉన్నది. దీనికి సంబంధించి ఎవరికైనా ఏ విధమైన అభ్యంతరాలు గానీ ఆక్షేపణలు గాని ఉన్న యెడల దివి.09-12-2024న ఉదయం 10.30 ని.లకు శ్రీకోర్టువారి ఎదుట స్వయముగా గానీ లేదా మీ అడ్వకేట్ గారి ద్వారా గానీ శ్రీ కోర్టు వారి ఎదుట హాజరై మీ సంజాయిషీ తెలియజేసుకోవలెను.

వాయిదా తేది: 09-12-2024

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులను అనుసరించి)

శ్రీ జి. మహేశ్వరరావు, శ్రీమతి ఆర్.లక్ష్మీదేవి, శ్రీ టి.వి. నారాయణరెడ్డి, పిటీషనర్స్ తరపు అడ్వకేట్స్

ప్రభుత్వంతో చర్చించి సమస్యలు పరిష్కరిస్తాం



యూనియన్ నాయకులతో సీతానగరం వైద్య సిబ్బంది

సీతానగరం, డిసెంబర్ 6(ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వంతో చర్చించి పరిష్కారం దిశగా అడుగులు వేస్తామని ఏపీజీఈఏ యూనియన్ స్టేట్ ప్రెసిడెంట్ శ్రీకాంత్ రాజు, స్టేట్ జనరల్ సెక్రటరి బి.త్కార రావు సభ్యులకు హామీ ఇచ్చారు. శుక్రవారం సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద యూనియన్ సమావేశం నిర్వహించారు. దీనికి హాజరైన వక్తలు మాట్లాడుతూ రాష్ట్రంలో వైద్య ఆరోగ్య శాఖలో ఎఫ్‌ఆర్‌ఎస్ రద్దు చేయా లని ఇటీవల తొలగించిన హెల్త్ అసిస్టెంట్లను తిరిగి విధుల్లోకి తీసుకోవడం వంటి అంశాలపై ప్రభుత్వంతో చర్చించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు ఏవీకె చైతన్య, జిల్లా ఏపీజీఈఏ అధ్యక్షులు ఎంవీవీ సత్యనారాయణ, తాలూకా అధ్యక్షులు వైఎస్ సుబ్బారాయుడు, యూనియన్ నాయకులు సీహెచ్ శ్రీనివాసరాజు, వై.ఉమాపార్వతీశం, సీహెచ్‌వో శర్మ, బేబి రామచంద్రరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ టోర్నమెంట్ ప్రారంభం

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల క్రీడా మైదానంలో ఆదికవి నన్నయ యూనివర్సిటీ అంతర్ జిల్లాల ఫుట్‌బాల్ టోర్నమెంట్ పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. రాజమహేంద్రవరం ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఏలూరు సీఆర్ రెడ్డి కళాశాల, కాకినాడ ఆదిత్య కాలేజీ, కొయ్యలగూడెం ప్రకాశం డిగ్రీ కాలేజీ, కాకినాడ ఐడియల్ కాలేజీల నుంచి మొత్తం 90 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో నన్నయ రిజిస్ట్రార్ సుధాకర్, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ చైర్మన్ రామచంద్ర ఆర్‌కే తదితరులు పాల్గొన్నారు.

నిరాశ్రయులకు రగ్గులు అందజేత

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో రోడ్డు పక్కన పడుకునే నిరాశ్రయులు చలికి వణుకుతుండటాన్ని గమనించిన స్వర్ణాంధ్ర స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకుడు డాక్టర్ గుబ్బల రాంబాబు రగ్గులను అందజేశారు. కంబాలచెరువు నుంచి దేవీచౌక్, గోకవరం బస్టాండ్, మునిసిపల్ కార్యాలయం బయట, పుష్కరాల రేవు ప్రాంతాల్లో ఉన్న పలువురు నిరాశ్రయులకు శుక్రవారం రాత్రి రగ్గులు పంచారు. కార్యక్రమంలో స్వర్ణాంధ్ర మేనేజరు వై.హరికృష్ణ, జి.కొండలరావు, పి.హరి ప్రసాద్, జి.మీరా కుమారి, పి.ధనలక్ష్మి పాల్గొన్నారు.

పార్టీల సోషల్ మీడియా రద్దు చేయాలి

ఆర్‌పీసీ రాష్ట్ర అధ్యక్షుడు మేడా

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ రాజకీయ పార్టీలకు చెందిన సోషల్ మీడియాలను తక్షణమే రద్దు చేయాలని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు మేడా శ్రీనివాస్ డిమాండ్ చేశారు. రాజమహేంద్రవరంలో శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సినీ దర్శకుడు రామ్‌గోపాల్ వర్మపై తక్షణమే పీడీయాక్ట్‌ను అమలు చేయాలన్నారు. సోషల్ మీడియా వేదికగా ఇష్టానుసారం వ్యవహరిస్తున్న వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వాలీబాల్ క్రీడాకారులకు ముగిసిన శిక్షణ




కొవ్వూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్రానికి పేరు తీసుకురావాలని గౌతమీ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు పరిమి హరిచరణ్ అన్నారు. కొవ్వూరు ఎన్టీఆర్ స్టేడియంలోని వాలీబాల్ గ్రౌండ్స్‌లో గౌతమీ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 1వ తేదీ నుంచి నిర్వహిస్తున్న వాలీబాల్ శిక్షణా తరగతులు శుక్రవారం ముగిసాయి. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-14 బాలికల జాతీయస్థాయి పోటీలకు ఎంపి కైన వివిధ జిల్లాలకు చెందిన 12 మంది క్రీడాకారులకు శిక్షణ అందించినట్లు క్యాంపు ఇన్‌చార్జి కొయ్యల ప్రసాద్ తెలిపారు. శిక్షణ పొందిన క్రీడాకారులు ఈ నెల 9నుంచి 15వరకు ఉత్తరప్రదేశ్‌లోని వారణాశిలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని హరిచరణ్ తెలిపారు. క్రీడాకారులకు వారం రోజులుగా భోజనాలను అవంతీ ఫౌండేషన్, వసతిని లిటరరీ క్లబ్ వారు అందజేశారన్నారు. కార్యక్రమంలో సూరపనేని చిన్ని, సీనియర్ క్రీడాకారులు పరిమి రాజేష్, కంటిపూడి శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ట్రూత్ వివేకామృత విజయోత్సవాలు

బిక్కవోలు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): బలభద్రపురం ఎంఎస్‌ఆర్ ఫంక్షన్ హాలులో వారం రోజులుగా నిర్వహిస్తున్న ట్రూత్ వివేకామృత విజయోత్సవాలు శుక్రవారం ముగిశాయి. వేడుకల ముగింపు సందర్భంగా మనలో వున్న ఆత్మజ్యోతికి ప్రతీకగా దేదీప్యమానంగా ప్రకాశిస్తున్న ఆకాశ దీపాలను ఏర్పాటు చేయడంతో గురువైన శ్రీవివేకానంద, సాధకులు ఈ వేడుకను తిలకించారు. అందరిలోను ఆ ఓంకారమే దైవంగా ఆత్మగా నిజమైన నేనుగా ప్రకాశిస్తుందని శ్రీవివేకానంద ప్రబోధించారు. అధిక సంఖ్యలో సాధకులు పాల్గొన్నారు.

బస్ షెల్టర్ ప్రారంభం

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం నందం గనిరాజు జంక్షన్‌లో లయన్ గొల్లపూడి వీరవెంకట రమణమూర్తి, గొల్లపూడి వీరాస్వామి సన్స్ బుక్ పబ్లిషర్స్ సహకారంతో బస్సు షెల్టర్ నిర్మించారు. లయన్స్ గవర్నర్ లయన్ ఈవివి ఈశ్వర్ కుమార్, లయన్స్ వైస్ గవర్నర్ ఈ.శ్రీనివాస్ శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో మాటూరి మంగతాయారు, ముదునూరి వాణిశ్రీ, గ్రంధి వెంకటేశ్వరరావు, తుమ్మిడి అరుణ్ కుమార్ పాల్గొన్నారు.



నేడు ఇసుక టెండర్ల స్క్రూట్నీ

రాజమహేంద్రవరం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఇటీవల వంగలపూడి-1, వంగలపూడి-2, జీడిగుంట ఓపెన్ ర్యాంపులకు టెండర్లు పిలవగా 37 దరఖాస్తులు వచ్చిన సంగతి విదితమే. వీటిని శుక్రవారం అధికారులు తెరిచారు. వాటిని శనివారం స్క్రూట్నీ చేయనున్నారు. సోమవారం నాటికి వీటిని ఖరారు చేస్తామని మైన్స్ ఏడీ ఫణిభూషణ్‌రెడ్డి తెలిపారు.



పల్లెలు..డిజిటల్!

ఇక పంచాయతీల్లో సేవలన్నీ ఆన్‌లైన్

ప్రపంచం అంతా మారిపోయింది.. డిజిటల్ వైపు పరుగులు పెడుతోంది.. ప్రస్తుతం రూపాయి చెల్లించాలన్నా ఆన్‌లైన్.. అయితే పంచాయతీల్లో మాత్రం ఇప్పటి కింకా పాత పద్ధతే. ఏ సేవ కావాలన్నా మాన్యువల్‌గా దరఖాస్తు చేయాల్సిందే.. వాళ్లూ అదే స్థాయిలో మాన్యువల్‌గా ధ్రువీకరణ పత్రం అందజేస్తారు. ఈ విధానానికి స్వస్తి పలకాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. దీనిలో భాగంగా డిజిటలైజేషన్ దిశగా అడుగులు వేస్తోంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 1103 పంచాయతీలు ఉండగా అన్నింటా ఈ సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఈ నేపథ్యంలో ఇక ఏ సేవ అయినా ఆన్‌లైన్‌లోనే. దీంతో గ్రామీణ ప్రజల కష్టాలు తీరనున్నాయి.. ఈ సేవలు జనవరి నుంచి అమల్లోకి వస్తాయి.

కార్పొరేషన్(కాకినాడ)/మండపేట, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): పంచాయతీల్లో ఇకపై డిజిటల్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. ప్రజలకు వేగంగా, పారదర్శకంగా ప్రభుత్వ సేవలు అందనున్నాయి. జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు కావాలంటే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేస్తే చాలు రెండు, మూడు రోజుల్లోనే జారీ కానున్నాయి. ఆన్‌లైన్‌లోనే ఆస్తిపన్ను చెల్లించొచ్చు.. వ్యాపార లైసెన్సులు పొందొచ్చు..వీటికి సంబంధించి కార్యదర్శులకు డిజిటల్ కీ అందుబాటులోకి రానుంది.దీంతో ఏ ధ్రువీకరణ పత్రం కావాలన్నా ఆన్‌లైన్‌క్లియర్‌గా ఉండనుంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని 62 మండలాలు 1103 పంచాయతీలున్నాయి.అన్ని పంచాయతీల్లో కొత్త విధానాన్ని అమలు చేయనున్నారు. పంచాయతీలు జారీ చేసే వివిధ ధ్రువీకరణ పత్రాలకు నిరీక్షించాల్సిన అవసరంలేదు. సులభంగా సర్టిఫికెట్లు పొందేలా రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ కొత్తవిధానానికి శ్రీకారం చుట్టింది. మీసేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకుంటే వాటిని కార్యదర్శులు పరిశీలించి డిజిటల్ సంతకాలు చేస్తారు. అనంతరం మీసేవ నుంచి సర్టిఫికెట్లు తీసుకునేలా చర్యలు చేపట్టారు.

కొత్త విధానం ఇలా..

పంచాయతీల ద్వారా జనన,మరణ ధ్రువీకరణ పత్రాలను మాన్యువల్ పద్ధతిలోనే జారీ చేస్తున్నారు. కొత్త విధానంలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వెంటనే అందులో నమోదు చేసిన ఫోన్ నెంబర్‌కి దరఖాస్తు సంఖ్య మెసేజ్ రూపంలో వస్తుంది. పత్రం సిద్ధం కాగానే దరఖాస్తుదారుడి ఫోన్ నెంబర్‌కు మెసేజ్ రూపంలో సమాచారం అందుతుంది.కొత్త విధానం అమల్లోకి రావడంతో పంచాయతీలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకుంటే సరిపోతుంది. రెండు, మూడ్రోజుల వ్యవధిలో సర్టిఫికెట్లు పొందే అవకాశం ఉంటుంది.

ఎక్కడి నుంచైనా చెల్లింపులు..

ప్రపంచంలో ఎక్కడ, ఏమూల ఉన్నా మీ సొంత ఊళ్లోని మీ ఇంటికి ఏటా ఆస్తిపన్ను చెల్లించాలంటే ఇక పంచాయతీ వరకు వెళ్లనక్కర్లేదు. ఉన్నచోటు నుంచే నేరుగా ఆన్‌లైన్‌లో ఆస్తిపన్ను చెల్లించవచ్చు. జనవరి నుంచి స్వర్ణ పంచాయతీల్లో భాగంగా డిజిటల్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. వ్యాపార లైసెన్సులు, భవన నిర్మాణ అనుమతులు, వివాహ, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు ఇలా పలు సేవలను ఆన్‌లైన్‌లోనే పొందవచ్చు. ఈమేరకు పంచాయతీల్లో పాయింట్ ఆఫ్ సేల్ (పీవోఎస్) పరికరాలు సిద్ధం చేస్తున్నారు. వీటితో డెబిట్, క్రెడిట్ కార్డుల ద్వారా బకాయిలు చెల్లించచ్చు. మరికొన్ని చోట్ల క్యూఆర్ కోడ్ ద్వారా పన్ను బకాయిలు వసూళ్లకు చర్యలు తీసుకుంటున్నారు. ప్రజల నుంచి వసూలు చేసిన మొత్తాలను ఆయా పంచాయతీల పీడీ ఖాతాల్లో జమయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు.

గత ప్రభుత్వం నిర్లక్ష్యం

ప్రజలకు సత్వరం సేవలందించే ఉద్దేశంతో 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వం డిజిటల్ పంచాయతీలను అభివృద్ధి చేసి ఒక పోర్టల్ తీసుకొచ్చింది. దీని నిర్వహణను అప్పట్లో నేషనల్ ఇన్ఫర్మాటిక్ సెంటర్ (ఎన్ఐ సీ)కి అప్పగించింది. వైసీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక ఎన్ఐసీ నిధులు ఇవ్వకపోవడంతో పోర్టల్ నిర్వహణ మూలనపడింది. దీంతో ఐదేళ్లపాటు పంచాయతీల డిజిటలైజేషన్ మూలన పడింది. కూటమి ప్రభుత్వం స్వర్ణ పంచాయతీ పోర్టల్ నిర్వహణను రాష్ట్ర ఆర్థిక నిర్వహణ, సేవల సంస్థకు అప్పగిస్తోంది.ఈ నేపథ్యంలో జనవరి నుంచి అమల్లోకి రానుంది. ఇక గ్రామీణ ప్రజల కష్టాలు తీరనున్నాయి.

- జనవరి నుంచి డిజిటలైజేషన్
- జిల్లాలో 1103 పంచాయతీలు
- స్వర్ణ పంచాయతీల్లో అమలు
- ప్రజలకు వేగంగా సేవలు
- ఆన్‌లైన్‌లోనే ధ్రువీకరణపత్రాలు
- ఎక్కడి నుంచైనా పన్నుల చెల్లింపు
- మారనున్న పంచాయతీ పాలన
- కార్యదర్శులకు డిజిటల్ కీ
- త్వరగా సర్టిఫికెట్ల జారీ

కార్యదర్శుల వివరాలు సేకరణ..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 62 మండలాలు 1103 పంచాయతీలున్నాయి. అన్ని పంచాయతీల్లో కొత్త విధానాన్ని అమలు చేయనున్నారు.మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శుల డిజిటల్ సంతకాలను బయోమెట్రిక్‌తో నమోదు చేశారు. డిజిటల్ టోకెన్లను జారీ చేయడానికి కార్యదర్శుల డిజిటల్ సంతకాలు, వివరాలను కంప్యూటర్ ఆపరేటర్ సేకరించారు. ప్రతి కార్యదర్శికి సంబంధించి సమగ్ర వివరాలను ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌లో పొందుపరుస్తున్నారు. ఇప్పటికే డిజిటల్ సంతకాల సేకరణ పూర్తి కాగా కార్యదర్శులకు డిజిటల్ కీలను జిల్లా ఉన్నత అధికారులు అందజేశారు.



తొలి దశలో ముఖ్యమైన సేవలు

పంచాయతీల్లో తొలిదశలో ముఖ్యమైన సేవలు ఆన్‌లైన్‌లోనే అందించనున్నారు. ఆస్తి విలువ ధ్రువీకరణ పత్రాలు, వ్యాపార లైసెన్సులు జారీ అయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నారు. జనన, మరణ, వివాహ ధ్రువీకరణ పత్రాలు, సూక్ష్మ చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటుకు నిరభ్యంతర ధ్రువీకరణపత్రాలు, భవన నిర్మాణాలకు అనుమతులు ఆన్‌లైన్‌లో అందించనున్నారు. పంచాయతీల్లో అందించే 80 సేవలను క్రమంగా స్వర్ణ పంచాయతీ పోర్టల్లో అందుబాటులో పెట్టనున్నారు. దీంతో గ్రామీణ ప్రజల కష్టాలు తీరనున్నాయి. ఇక ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేస్తే చాలు 80 రకాల సేవలు అందుబాటులోకి వస్తాయి.

మీ భవిష్యత్ మా చేతిలో ఉంది.. బ్యాడ్ కాండక్ట్ అని రాస్తాం!

- డైట్ కళాశాల ప్రిన్సిపాల్ బెదిరింపులు..
- ఆర్‌జేడీ విచారణలో విద్యార్థినుల ఏకరవు

రాజమహేంద్రవరం రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : బొమ్మూరు డైట్ కళాశాలలో విద్యార్థినుల ఫిర్యాదులపై ఆర్‌జేడీ జి.నాగమణి విచారణ చేపట్టారు. విద్యార్థినులపై వేధింపులు, హాస్టల్‌లో సమస్యలు తదితర అంశాలపై డైరెక్టరేట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఆంధ్రప్రదేశ్ ఆదేశాల మేరకు శుక్రవారం ఆమె పరిశీలించారు. అనంతరం సెమినార్ హాల్‌లో కళాశాల ప్రిన్సిపాల్ జయశ్రీ సమక్షంలో నిర్వహించిన విచారణలో విద్యార్థినులు పలు సమస్యలపై ఏకరువు పెట్టారు. తమకు కనీస సౌకర్యాలు లేవని, అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని, కనీసం హాస్టల్ వద్ద నైట్ వాచ్‌మెన్ కూడా లేడని వాపోయారు.అయితే నైట్ వాచ్‌మెన్ ఖర్చులంటూ తమ వద్ద నుంచి డబ్బులు వసూలు చేసేవారని తెలిపారు. మీ కేరీర్ మా చేతిలో ఉంది..బ్యాడ్ కాండక్ట్ అని రాస్తే మీకు భవిష్యత్ ఉండదని పలుమార్లు ప్రిన్సిపాల్ బెదిరించేవారని విచారణ అధికారుల ముందు వాపోయారు.సమస్యలన్నీ విన్న తరువాత ఎవరికి వారు తమ సమస్యలను కాగితంపై రాసి ఇవ్వాలంటూ చెప్పడంపై విద్యార్థులు భయపడ్డారు.విచారణలో ఆర్‌జేడీ నాగమణి, ఏసీసి సుభాషిణి పాల్గొన్నారు.గతంలో విద్యార్థినులపై అసభ్యంగా ప్రవర్తించిన తెలుగు లెక్చరర్‌ను సస్పెండ్ చేశారు. మరొకరిని సీతానగరం మండలానికి బదిలీ చేయడంతో పాటు అటెండర్‌పై చర్యలు చేపట్టిన సంగతి తెలిసిందే.



హోంగార్డుల స్థాపక దినోత్సవంలో మాట్లాడుతున్న ఎస్పీ నరసింహ కిశోర్

హోంగార్డులు పోలీస్ శాఖలో అంతర్భాగమే

ఎస్పీ నరసింహ కిశోర్

రాజమహేంద్రవరం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖలో హోంగార్డులు నిస్వార్థ సేవలందిస్తున్నారని ఎస్పీ నరసింహ కిశోర్ అన్నారు. హోంగార్డుల 62వ స్థాపక దినోత్సవం సందర్భంగా శుక్రవారం జరిగిన కార్యక్రమానికి హాజరై గౌరవ వందనం స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడారు. పోలీసు శాఖలో హోంగార్డులు అంతర్భాగమన్నారు. వీరిలో కొందరు పోలీస్ స్టేషన్లలో కంప్యూటర్ ఆపరేటర్లుగా తదితర సేవలు అందిస్తున్నారని చెప్పారు. ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో శాఖకు మంచి పేరు తేవాలని సూచించారు. సేవాభావంతో ముందుకు సాగాలన్నారు.అనంతరం హోం గార్డులతో ఎస్పీ ముఖాముఖి మాట్లాడి వారి కుటుంబ పరిస్థితులు,విధుల్లో ఇబ్బందులు, ఆర్థిక సమస్యలపై ఆరా తీశారు. వెంటనే పరిష్కార దిశగా చర్యలు తీసుకోవాలని అధికా రులను ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు ఏవీ సుబ్బరాజు,ఎన్‌బీఎం మురళీ కృష్ణ, ఎల్.చెంచిరెడ్డి, డీఎస్పీలు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ల రైటర్లకు శిక్షణ

ఎస్పీ నరసింహ కిశోర్ స్వీయ పర్యవేక్షణలో అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) మురళీకృష్ణ ఆధ్వర్యంలో సిబ్బంది శిక్షణ ఇస్తున్నారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల రైటర్లు, అసిస్టెంట్ రైటర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, పీజీఆర్ఎస్, సీసీటీ ఎన్ఎస్ అప్డేషన్,అఫెండర్ సర్వైలెన్స్, చాట్ జీపీటీ తదితర పోలీసు అప్లికేషన్లపై రెండు రోజుల పాటు 45 మందికి శిక్షణ ఇచ్చారు.



రోడ్లకు.. మహర్దశ!

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రహదారి మరమ్మతు పనులు ఉమ్మడి జిల్లాలో పూర్తిస్థాయిలో త్వరలోనే ప్రారంభం కానున్నాయి. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో కొన్నిచోట్ల జాప్యం జరిగింది. కోడ్ ముగిసిన వెంటనే పెండింగ్‌లో ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డు మరమ్మతు పనులకు సంబంధించి టెండర్లను పిలవడానికి అధికారులు కసరత్తు చేస్తున్నారు. ప్రధానంగా 30 ఆర్‌అండ్‌బీ రోడ్ల మరమ్మతు పనులకు టెండర్లకు ఆహ్వానం పలకనున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో రూ.127.48 కోట్లతో 407 పనులు చేయాలని ఎన్నికల కోడ్‌కు ముందు టెండర్లను ఆహ్వానించారు. కాంట్రాక్టర్ల నుంచి టెండర్లు రావడంతో 377 పనుల వరకు ఖరారు చేశారు. వీటిలో తొలి ఫేజ్‌లో 172 రోడ్డు మరమ్మతు పనులు ప్రారంభించారు. తర్వాత ఫేజ్‌లో మిగిలిన 205 పనులను మొదలుపెట్టారు. ఇటీవల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక నేపథ్యంలో 30 పనులకు సంబంధించి టెండర్లు ఖరారు కాలేదు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఈ పనులకు ఈనెల 13,16వ తేదీల్లో టెండర్లకు ఆహ్వానం పలకాలని ఆర్‌అండ్‌బీ అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈనెల 12వ తేదీతో ఎన్నికల మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ ముగియనుంది. దీంతో నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం టెండర్లను పిలుస్తున్నారు. టెండర్లు పిలిచిన తర్వాత అగ్రిమెంట్లు చేసుకుని ఆర్‌అండ్‌బీ రోడ్డు మరమ్మతు పనులను చేపట్టనున్నారు.

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దృష్టి
- ఆర్‌అండ్‌బీ రోడ్ల మరమ్మతులు
- రూ.127.48 కోట్లు మంజూరు
- 407 పనులకు టెండర్లు
- 377 పనులు ప్రారంభం
- కోడ్‌తో ఆగిన 30 పనులు
- 13, 16 తేదీల్లో రీటెండర్లు
- జనవరి నెలాఖరుకు గడువు

గత ప్రభుత్వంలో అధ్వానం..

గత వైసీపీ ప్రభుత్వంలో ఒక్క రోడ్డు మరమ్మతు పని కూడా చేయలేదు. దీంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఆర్‌అండ్‌బీ రహదారులు అధ్వానంగా దర్శనమిచ్చాయి. ఉమ్మడి జిల్లా వాసులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వర్షం పడితే గుంతల రోడ్లపై ప్రయాణించలేక వాహనదారులు ప్రమాదాల బారినపడ్డారు. ఐదునెలల కిందట కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రోడ్ల దశ మారింది. రోడ్ల మరమ్మతులకు పెద్దఎత్తున నిధులు విడుదల చేశారు. దీంతో రోడ్లపై గతుకుల బాధ తప్పుతోంది. ఉమ్మడి జిల్లాలో కాకినాడ, అమలాపురం, రాజమహేంద్రవరంతో పాటు ఇతర పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల మరమ్మతులు జరుగుతున్నాయి.

తుఫాన్ల వల్ల జాప్యం

గత రెండు నెలల్లో సంభవించిన తుఫాన్ల వల్ల మరమ్మతు పనులు చేయడానికి ఆటంకాలు ఏర్పడ్డాయి. రోడ్లపై నీరు నిలిచిపోవడం వల్ల కొంతవరకు జాప్యం జరిగినట్టు అధికారులు చెప్తున్నారు. ప్రస్తుతానికి వాతావరణం అనుకూలంగా ఉండడం వల్ల పనుల వేగం పెరుగుతుందని అందరూ భావిస్తున్నారు. ఈ విషయమై కాకినాడ సర్కిల్ ఆర్‌అండ్‌బీ ఎస్ఈ జి.కంఠును 'ఆంధ్రజ్యోతి' సంప్రదించగా పెండింగ్‌లో ఉన్న పనులకు కోడ్ ముగిసిన వెంటనే టెండర్లు పిలుస్తున్నామన్నారు. వచ్చే ఏడాది జనవరి నెలాఖరుకల్లా మొత్తం మరమ్మతు పనులు పూర్తి చేసేలా కార్యాచరణ అమలు చేస్తున్నామన్నారు. ఈ పనులు చేసేందుకు నిధులు సిద్ధంగా ఉన్నాయని, అడ్డంకులు ఎదురైనా వాటిని అధిగమించి నిర్దేశిత సమయానికి ఆర్‌అండ్‌బీ రోడ్డు మరమ్మతు పనులు పూర్తి చేస్తామని చెప్పారు.



నేడు షష్ఠి

సుబ్రహ్మణ్య షష్ఠి ఉత్సవాలకు ఆలయాలు ముస్తాబయ్యాయి.. జిల్లాలోని బిక్కవోలు, రాజానగరం, కొవ్వూరు, తాళ్ళపూడి, దేవరపల్లి, గోపాలపురం తదితర ప్రాంతాల్లో శనివారం నుంచి షష్ఠి ఉత్సవాలు ఘనంగా జరుగుతాయి. ఈ మేరకు ఆలయాల వద్ద భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.. - 10లో



ఐజీ తనిఖీ

ప్రతి వారం క్రైం పురోగతిపై సమీక్ష చేస్తున్నాం.. జిల్లాలో మహిళలు, చిన్నారుల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం.. గస్తీని పెంచుతున్నాం.. ఎప్పటికప్పుడు అనుమానిత ప్రాంతాలపై దృష్టి పెడుతున్నామని ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్ తెలిపారు.. నిడదవోలు పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. - 9లో



నాడు కుదరదని.. నేడిచ్చేశారు!

నాడు నిబంధనలకు విరుద్ధంగా వేసిన రోడ్డుకు నేడు బిల్లుల చెల్లింపులు

అధికారం మారింది.. అధికారులు మాత్రం మారలేదు.. నేటికీ ఆ వైపే ఉన్నారు.. నాడు నిబంధనలకు విరుద్ధంగా చేసిన పనులకు నేటికీ కొమ్ముకాస్తున్నారు.ఈ సంఘటనే అందుకు ఉదా హరణ.. గత ప్రభుత్వ హయాంలో కనీసం పంచాయతీల తీర్మానం కాకుండా రూ.1.30 కోట్ల తో ఇష్టానుసారం ఒక రోడ్డు వేసేశారు.. ఆ రోడ్డుపై 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితం కావడంతో నాడు బిల్లులు ఆపేశారు.. అయితే ఈ ఐదు నెలల్లో ఏం జరిగిందో ఏమో కానీ.. అన్నీ తెలిసిన ఆ అధికారే గుట్టుచప్పుడు కాకుండా బిల్లులు చెల్లించేశారు.. దీనిపై భిన్న వాదనలు వినిపిస్తున్నాయి.

రాజమహేంద్రవరం రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మనోళ్లే.. బిల్లులు చెల్లించేయండి.. ఈ మాట కూటమి ప్రభుత్వ నేతలకో, కార్యకర్తలకో కాదు.. గత ప్రభుత్వ హయాంలో ఉపాధి నిధులతో నిబంధనలకు విరుద్ధంగా వేసిన రోడ్డుకు సంబంధించి రూ.1.30 కోట్లు చెల్లింపులు గుట్టుచప్పుడు కాకుండా జరిగిపోయాయి. రాజమహేంద్రవరం రూరల్ మండలం పరిధి హుకుంపేట,పిడింగొయ్యి, శాటిలైట్‌సిటీ పరిధి పిట్టలవారి చెరువు ప్రాంతం నుంచి ప్రైవేటు లే అవుట్ల (జనావాసాలు లేని) వెంబడి ఆదిత్య తక్ష ప్రైవేటు పాఠశాల వరకు 1183 మీటర్ల పొడవు గల సీసీ రోడ్డు ఉపాధి నిధులతో గత ప్రభుత్వ హయాంలో నిర్మించారు.ఈ రోడ్డు నిర్మాణానికి మూడు గ్రామ పంచాయతీల తీర్మానం ఉండాల్సి ఉండగా ఒక్క పిడింగొయ్యి పంచాయతీ ప్రత్యేకాధికారి,విశ్రాంత జిల్లా పంచాయతీ అధికారి జానా సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి రూప్ చంద్‌ల తీర్మానంతో 2024 జూన్ నెలలో రోడ్డు నిర్మాణం చేపట్టి పూర్తిచేశారు. గత ప్రభు త్వంలో ఇన్‌చార్జి మంత్రి చెల్లుబోయిన వేణుగోపా లకృష్ణ, అప్పటి జిల్లా కలెక్టర్ మాధవీలత ఒత్తిడి చేయడంతో తాము తీర్మానం చేశామని పంచా యతీ అధికారులు, వారంతా పెద్ద వాళ్లు కావ డంతో తామేమీ చేయలేక పనులు చేయాల్సి వచ్చిందని మండల పరిషత్, ఇంజనీరింగ్ అధికారులు నాడు చెప్పుకొచ్చారు. ఇదే విషయమై జూన్ 17న ఆంధ్రజ్యోతి దినపత్రికలో "సర్కారు సొమ్ముతో షోకులు" అన్న శీర్షికన ఒక కథనం ప్రచురితమైంది.దీనిపై సంబంధిత పనులకు సంబంధించి వర్క్ రికార్డింగ్ చేయబోమని ఇంజనీరింగ్ అధికారులు, లేబరు కాం పోనెంట్, బిల్లులు నిలుపుదల చేస్తామని ఎంపీడీవో, ఎన్ ఆర్ఈజీఎస్ అధికారులు తెలిపారు. సుమారు ఐదు నెలలు తిరిగే సరికి సీన్ రివర్స్ అయింది. వారంతా చుట్టాలైపోయారు.. ధనం మూలం ఇదం జగత్ అంటే ఇదే అనేలా..అప్పటి ఇంజ నీరింగ్ అధికారులు,ఎంపీడీవో కూడా మారలేదు.గత ప్రభుత్వంలోను వీరే. ప్రస్తుతం వీరే ఉన్నారు.. అయినా గుట్టుచప్పుడు కాకుండా బిల్లులు చేసేశారు. దీనిపై రకరకాల ఆరోపణలు వినిపిస్తు న్నాయి. నాడు ఆపిన బిల్లులు నేడు ఎలా చెల్లింపులు చేశారో తెలియక చాలా మంది తలలు పట్టుకుంటున్నారు.కలెక్టర్ ప్రశాంతి ఆ రోడ్డును పరిశీలించి బిల్లుల చెల్లింపులపై దృష్టి సారించాలని డిమాండ్ చేస్తున్నారు.

- నాడు 'ఆంధ్రజ్యోతి' కథనం
- బిల్లులు ఆపేసిన అధికారులు
- నేడు గుట్టుగా చెల్లింపులు
- నాటి అధికారులే నేటికీ
- అయినా ఎందుకో మారారు
- కలెక్టర్ తేల్చాలని డిమాండ్

10, 11 తేదీల్లో కలెక్టర్లతో సీఎం చంద్రబాబు సమీక్ష

రాజమహేంద్రవరం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి) : అమరావతిలో ఈ నెల 10,11 తేదీల్లో సీఎం చంద్రబాబు జిల్లా కలెక్టర్లతో సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. సమావేశానికి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి హాజరు కానున్నారు. దీనిలో భాగంగా ప్రభుత్వ శాఖల వారీ చేపట్టిన పనుల పురోగతిని శుక్రవారం కలెక్టర్ సమీక్షించారు. జిల్లాలో వివిధ శాఖల ద్వారా చేపట్టిన పనులు వేగవంతం చేయాలని, సీఎస్ఆర్ నిధులతో చేపట్టిన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. పనుల పురోగతిపై ఫొటోలు అందజేయాలన్నారు. సీఎస్ఆర్ పనుల్లో భాగంగా గోకవరం అస్సాగో సౌజన్యంతో రూ.8 లక్షలతో రాజమహేంద్రవరం గిరిజన సంక్షేమ పీఎంఎస్ వసతి గృహాన్ని అభివృద్ధి చేస్తున్నామన్నారు. బలభద్రపురంలోని గ్రాసం ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ నిధులు రూ.22 లక్షలతో గిరిజన సంక్షేమ పీఎంఎస్ బాలుర వసతి గృహం పనులు త్వరలో ప్రారంభిస్తామని చెప్పారు. సర్వారాయ సుగర్స్ బాటిలింగ్ యూనిట్ తరపున రూ.2 లక్షలతో కడియం బీసీ బాలుర వసతి గృహం భవనం పనులు చేసినట్టు తెలిపారు. సమావేశంలో జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి ఎల్.అప్పలకొండ, డీఆర్‌డీఏ పీడీ ఎన్‌వీవీఎస్ మూర్తి, సాంఘిక సంక్షేమ అధికారి ఎం.సందీప్ పాల్గొన్నారు.

బహిరంగ మూత్ర విసర్జన చేస్తే రూ.500 కట్టాల్సిందే!

కొవ్వూరులో అమలు : కమిషనర్

కొవ్వూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : కొవ్వూరు వెళ్లి బహిరంగ మల, మూత్ర విసర్జన చేశారో జాగ్రత్త..ఒక వేళ చేస్తే రూ.500 ఫైన్.కొవ్వూరు మునిసిపాలిటీని బహిరంగ మల, మూత్ర విసర్జన రహిత పట్టణంగా తీర్చిదిద్దడానికి మునిసిపల్ కమిషనర్ టి.నాగేంద్రకుమార్ చర్యలు చేపట్టారు. స్వచ్ఛభారత్ 2.0లో భాగంగా కొవ్వూరు పట్టణాన్ని బహిరంగ మల,మూత్ర విసర్జన రహిత (ఓడీఎఫ్ ప్లస్) పట్టణంగా ప్రకటించడం జరిగిందన్నారు. ఈ నేపథ్యంలో పట్టణ ప్రజలంతా స్వచ్ఛతను పాటించాలన్నారు.నిబంధనలు అతిక్రమిస్తే రూ. 200ల నుంచి 500ల వరకు జరిమానా విధించడం జరుగుతుందన్నారు.ఈ మేరకు ఊరూవాడా ప్రచారం చేశారు.కొవ్వూరులో బహిరంగ మల, మూత్ర విసర్జన జరిగే ప్రాం తాలపై దృష్టి పెట్టామని కమిషనర్ తెలిపారు.

ప్రజారోగ్య భద్రతకు ఎన్‌సీడీసీడీ 3.0 సర్వే



నెహ్రూనగర్‌లో ఆరోగ్యశాఖ సర్వేను పరిశీలిస్తున్న డాక్టర్ సంధ్య

డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ సంధ్య

నిడదవోలు, డిసెంబరు 06 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ప్రజల ఆరోగ్య భద్రతకు వైద్య ఆరోగ్యశాఖ ఎన్‌సీడీసీడీ 3.0 సర్వే నిర్వహిస్తోందని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ జె.సంధ్య అన్నారు. శుక్రవారం నిడదవోలులోని నెహ్రూనగర్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్(యూపీహెచ్‌సీ)ని ఆమె పరిశీలించారు. అనంతరం ఇంటింటా జరుగుతున్న సర్వే తీరుతెన్నులను ఆమె స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ సంధ్య మాట్లాడుతూ ఈ సర్వే ముఖ్య ఉద్దేశ్యం ప్రజలకు వివిధ రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఏదైనా సమస్య ఉంటే ముందుగానే గుర్తించి దానికి వైద్య సేవలందించడమని అన్నారు. నెహ్రూనగర్ యూపీహెచ్‌సీ పరిధిలో ఇంటింటా సర్వే వేగవంతంగా సాగుతుందని ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె వెంట మెడికల్ ఆఫీసర్ డాక్టర్ తేజశ్రీ, వైద్య సిబ్బంది ఉన్నారు.

వాలీబాల్ క్రీడాకారులకు ముగిసిన శిక్షణ



జాతీయ వాలీబాల్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

కొవ్వూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్రానికి పేరు తీసుకురావాలని గౌతమీ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు పరిమి హరిచరణ్ అన్నారు. కొవ్వూరు ఎన్టీఆర్ స్టేడియంలోని వాలీబాల్ గ్రౌండ్స్‌లో గౌతమీ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 1వ తేదీ నుంచి నిర్వహిస్తున్న వాలీబాల్ శిక్షణా తరగతులు శుక్రవారం ముగిసాయి. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-14 బాలికల జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన వివిధ జిల్లాలకు చెందిన 12 మంది క్రీడాకారులకు శిక్షణ అందించినట్టు క్యాంపు ఇన్‌చార్జి కొయ్యల ప్రసాద్ తెలిపారు. శిక్షణ పొందిన క్రీడాకారులు ఈ నెల 9నుంచి 15వరకు ఉత్తరప్రదేశ్‌లోని వారణాశిలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని హరిచరణ్ తెలిపారు. క్రీడాకారులకు వారం రోజులుగా భోజనాలను అవంతీ ఫౌండేషన్, వసతిని లిటరరీ క్లబ్ వారు అందజేశారన్నారు. కార్యక్రమంలో సూరపనేని చిన్ని, సీనియర్ క్రీడాకారులు పరిమి రాజేష్, కంటిపూడి శివరామకృష్ణ, నాళం సత్యనారాయణ, కోచ్‌లు రాపాక సురేష్, పి.గంగాధర్, పీడీ ఎ.విజయకుమార్ పాల్గొన్నారు.

డివైడర్ దాటి లారీని ఢీకొన్న వ్యాన్

» టైరు పేలడంతో అదుపు తప్పిన వాహనం

» వ్యాన్ డ్రైవర్ మృతి





ప్రమాదంలో నుజ్జునుజ్జయిన వ్యాన్, నరసింహులు(ఫైల్)

నల్లజర్ల, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం దూబచర్లలో శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో అనంతపురం జిల్లా తాడిపత్రి మండలం చుక్కలూరు గ్రామానికి చెందిన శ్యామర్ల నరసింహులు(30) మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. నరసింహులు అనంతపురం నుంచి రాజమహేంద్రవరం వ్యాన్‌లో దానిమ్మకాయల లోడుతో వస్తున్నాడు. దూబచర్ల వద్ద వ్యాన్ ముందు టైరు పేలి అదుపు తప్పి డివైడర్ అవతల వైపు ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టింది. ఈ ఘటనలో డ్రైవర్ నరసింహులు అక్కడికక్కడ మృతి చెందగా వ్యాన్ నుజ్జునుజ్జు అయ్యింది. దానిమ్మకాయల లోడు రోడ్డుపై పడిపోవడంతో స్థానికులు కాయల కోసం ఎగబడ్డారు. కాగా నరసింహులుకు భార్య మహాలక్ష్మి, కుమారుడు మనోజ్ ఉన్నారు. రాజమహేంద్రవరం వెళ్లి వస్తానని చెప్పి విగత జీవిగా పడి ఉండడంతో భార్య, బంధువులు కన్నీటి పర్యంతమయ్యారు. ఎస్‌ఐ సోమరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడేపల్లిగూడెం ఆసుపత్రికి తరలించారు.

10 నుంచి రెవెన్యూ సదస్సులు

కొవ్వూరు తహశీల్దార్ దుర్గాప్రసాద్

కొవ్వూరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఈనెల 10వ తేదీ నుంచి గ్రామాల వారీగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్టు కొవ్వూరు తహశీల్దార్ ఎం.దుర్గాప్రసాద్ తెలిపారు. ఈ నెల 10వ తేదీ నుంచి జనవరి 8వ తేదీ వరకు పట్టణ, మండలంలోని 16 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్టు చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో భూ సమస్యల పరిష్కారం కోసమే రాష్ట్ర ప్రభుత్వం ఈ సదస్సులు నిర్వహిస్తోందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ నెల 10న దొమ్మేరు 1,2 సచివాలయాలు, కాపవరం సచివాలయానికి సంబంధించి దొమ్మేరు 1వ సచివాలయంలో, 11న నందమూరు, 12న కొవ్వూరు మున్సిపాల్టీ పరిధిలోని 10 సచివాలయాలకు సంబంధించి కొవ్వూరు తహశీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో, 13న పెనకనమెట్ట, 17న పశివేదల, 18న తోగుమ్మి, 19న సీతంపేట, 20న కుమారదేవం, 24న ధర్మవరం, 26న పంగిడి, 27న దేచర్ల, 31న వేములూరు, జనవరి 2న వాడపల్లి, 3న మద్దూరు, 7న చిడిపి, 8న ఆరికిరేవుల గ్రామాల్లోని సచివాలయాల్లో ఈ సదస్సులు నిర్వహించనున్నట్టు తెలిపారు.

కారు-మోటార్‌సైకిల్ ఢీ

» యువకుడికి తీవ్ర గాయాలు

» రోడ్డు కం రైలు బ్రిడ్జిపై స్తంభించిన వాహన రాకపోకలు



ఆర్‌అర్ బ్రిడ్జిపై నిలిచిపోయిన ట్రాఫిక్, క్షతగాత్రుడు



కొవ్వూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కారు, మోటారుసైకిల్ ఢీకొన్న ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. కొవ్వూరు రోడ్డు కం రైలు బ్రిడ్జి 165వ స్తంభం వద్ద కొవ్వూరు వైపు నుంచి వస్తున్న కారు రాజమహేంద్రవరం వైపు నుంచి మోటారుసైకిల్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడు కిందపడడంతో తలకు తీవ్ర రక్తగాయాలయ్యాయి. క్షతగాత్రుడు తొర్రేడు గ్రామానికి చెందిన మన్యం వీరవెంకట రామకృష్ణగా పోలీసులు గుర్తించారు. ఈ ప్రమాదంతో రోడ్డు కం రైలు బ్రిడ్జిపై ఇరువైపులా ట్రాఫిక్ స్తంభించింది. వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. పాఠశాలలు, కార్యాలయాలు వదిలే సమయం కావడంతో విద్యార్థులు, ఉద్యోగులు ట్రాఫిక్‌లో చిక్కుకున్నారు. సమాచారం తెలుసుకున్న కొవ్వూరు సీఐ పి.విశ్వం సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రుడిని రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించారు. అనంతరం ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

సూత్రాల తాడు అపహరణ

తాళ్లపూడి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నదేవరపేటలో ఓ మహిళ మెడలో బంగారు సూత్రాలతో ఉన్న గొలుసును గుర్తుతెలియని వ్యక్తి అపహరించిన సంఘటన శుక్రవారం జరిగింది. గ్రామంలోని బీసీ కాలనీలో నివాసం ఉంటున్న పట్నాల ఉమా మహేశ్వరరావు భార్య లక్ష్మి ఇంటి పెరట్లో పని చేసుకుంటుండగా గుర్తుతెలియని వ్యక్తి వచ్చి మెడలోని గొలుసు తెంపుకుని పారిపోయాడని, దాని విలువ సుమారు రూ.1 లక్ష ఉంటుందని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ టి.రామకృష్ణ తెలిపారు.

సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం

కొవ్వూరు, డిసెంబరు 6 (ఆంధ్రజోతి): వల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి కళ్యాణం వైభవంగా నిర్వహించారు. శుక్రవారం కొవ్వూరు రైల్వేస్టేషన్ సమీపంలోని సంస్కృత పాఠశాల ప్రాంగణంలో శ్రీలలితపార్వతీ సమేత గోష్పదేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి కళ్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. కొవ్వూరు పట్టణ, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధికసంఖ్యలో కళ్యాణాన్ని తిలకించారు.

ఫుట్‌బాల్ టోర్నీ ప్రారంభం

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల క్రీడామైదానంలో ఆదికవి నన్నయ యూనివర్శిటీ అంతర్ జిల్లాల ఫుట్‌బాల్ టోర్నమెంట్ పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. రాజమహేంద్రవరం ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఏలూరు సీఆర్ రెడ్డి కళాశాల, కాకినాడ ఆదిత్య కాలేజీ, కొయ్యలగూడెం ప్రకాశం డిగ్రీ కాలేజీ, కాకినాడ ఐడియల్ కాలేజీల నుంచి మొత్తం 90 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో నన్నయ రిజిస్ట్రార్ సుధాకర్, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ చైర్మన్ రామచంద్ర ఆర్‌కే పాల్గొన్నారు.

బస్ షెల్టర్ ప్రారంభం

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం నందం గనిరాజు జంక్షన్‌లో లయన్ జీవీవీ రమణమూర్తి, గొల్లపూడి వీరాస్వామి సన్స్ బుక్ పబ్లిషర్స్ సహకారంతో బస్సుషెల్టర్ నిర్మించారు. లయన్స్ గవర్నర్ ఈవీవీ ఈశ్వర్ కుమార్, వైస్ గవర్నర్ ఈ.శ్రీనివాస్ శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో మాటూరి మంగతాయారు, ముదునూరి వాణిశ్రీ, గ్రంధి వెంకటేశ్వరరావు, టి.అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రపంచ మేధావి

» కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి

» రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ వర్ధంతి

» నివాళులర్పించిన ప్రజాప్రతినిధులు, నాయకులు

» పలుచోట్ల సేవా కార్యక్రమాలు



కొవ్వూరులో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): బడుగు బలహీనవర్గాల వికాసానికి పాటుపడిన మహానేత, భారతదేశ ఔన్నత్యాన్ని ప్రజాస్వామ్య స్ఫూర్తిని విశ్వవ్యాప్తం చేసిన కీర్తిశిఖరం, ప్రపంచ మేధావి అంబేడ్కర్ అని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ 68వ వర్ధంతి కార్యక్రమాలను పలుచోట్ల శుక్రవారం నిర్వహించారు. కొవ్వూరులోని టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి ఎమ్మెల్యే ముప్పిడి నివాళులర్పించారు. తమ లాంటి వారు ఎమ్మెల్యేలుగా కొనసాగుతున్నారంటే దానికి మూల పురుషుడు, అంబేడ్కర్ అని, దళితుల కోసం జీవితాన్నే పణంగా పెట్టారన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు దాయన రామకృష్ణ, సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, పెనుమాక జయరాజు, మాల మహాసభ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంటు బొంతా శ్యాం రవిప్రకాష్ పాల్గొన్నారు. బస్టాండ్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, కంఠమణి రమేష్‌బాబు, కవల నాగేశ్వరరావు, మాసా ఆనంద్, చిట్టూరి అన్నవరం పాల్గొన్నారు. కొవ్వూరు 4వ వార్డు మెరకవీధిలో మాల మహాసభ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంటు బొంతా శ్యాం రవిప్రకాష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి ముఖ్యఅతిథిగా విచ్చేసి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పట్టణ సీఐ పి.విశ్వం, రిటైర్డ్ ఉద్యోగ సంఘం నాయకులు పెనుమాక జయరాజు, సీహెచ్ చిట్టిరాజు, మాసా ఆనంద్, ఎం. బంగార్రాజు పాల్గొన్నారు.

తాళ్లపూడి: అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా వేగేశ్వరపురం నవచైతన్య యూత్ సభ్యుల ఆధ్వర్యంలో పలు ఆసుపత్రుల్లో రోగులకు పండ్లు, రొట్టెలు అందించారు. తాళ్లపూడి శ్రీ సాయిస్ఫూర్తి హాస్పిటల్ సీఈవో విజయరాజు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి పాటు పడిన అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా నడుచుకోవాలని అన్నారు. కార్యక్రమంలో నవ చైతన్య యూత్ సభ్యులు పాల్గొన్నారు. గజ్జరంలో సర్పంచ్ గండి రాంబాబు, వెల్‌కేర్ యూత్ ఆధ్వర్యంలో పాతపేట, మెయిన్ రోడ్డులో అంబేడ్కర్ విగ్రహాలకు, సచివాలయంలోని చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో కార్యదర్శి వెంకటేశ్వరమ్మ, ఎంపీటీసీ గుంటు చిన్నాబ్బాయి, వెల్‌కేర్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

నిడదవోలు: సమాజంలోని మనుషుల మధ్య అంతరాలను తగ్గించడానికి రాజ్యాంగం ద్వారా కృషి చేసిన మహోన్నత వ్యక్తి బీఆర్ అంబేడ్కర్ అని టీడీపీ పట్టణాధ్యక్షుడు కొమ్మిన వెంకటేశ్వరరావు అన్నారు. నిడదవోలులోని పార్టీ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి ఆయన పూలమాలలతో నివాళులర్పించారు.కార్యక్రమంలో కౌన్సిలర్ కారింకి నాగేశ్వరరావు, బైపే రాజేశ్వర రావు, ఎండీ షాజహాన్, అస్మత్ వినోద్, రామదాసు పాల్గొన్నారు. స్థానిక సంతమార్కెట్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ పూలమాలలతో నివాళులర్పించారు. అలాగే పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో జైభారత్ సామాజిక విప్లవ భేరీ రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి డేవిడ్‌కుమార్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి జువ్వల రాంబాబు, జనసేన నాయకుడు రంగా రమేష్, డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి..అంబేడ్కర్‌కు నివాళులర్పించారు.

పెరవలి/ఉండ్రాజవరం: పెరవలి మండల పరిషత్ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి ఎంపీపీ కార్చెర్ల సీతారామ్‌ప్రసాద్ పూల మాలలు వేశారు. అంబేడ్కర్‌ను ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరూ పనిచేయాలన్నారు. కార్యక్రమంలో కార్యాలయ ఉద్యోగులు గంటా శ్రీనివాస్, నారాయణ, శంకర్, పి.శ్రీనివాస్ పాల్గొన్నారు. కానూరులో సర్పంచ్ భావన మధు అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో న్యాయవాది సుధాకర్, నవీన్, మెల్లిమి శ్రీను పాల్గొన్నారు. దమ్మెన్ను పంచాయతీ కార్యాలయం వద్ద సత్యనారాయణ, కార్యదర్శి వి.సంధ్యారాణి, దుర్గారావు, జయకృష్ణ, వెలగదుర్రులో యువజన సంఘం సభ్యుడు జయరాజు, ప్రసాద్ పాల్గొన్నారు.

చాగల్లు: స్థానిక రేడియో రూమ్ వద్ద నవోదయ యంగ్‌మెన్ అసోసియేషన్, మాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అంబేడ్కర్ వర్ధంతిని నిర్వహించి ఆయన విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పించారు. ఎంపీటీసీ విజయకుమారి, జాలెం వెంకటరావు, చిలకపాటి నాని పాల్గొన్నారు. సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద జరిగిన కార్యక్రమంలో బహుజన రచయితల వేదిక రాష్ట్ర కన్వీనర్ నేలపూరి రత్నాజీ, మాల సంక్షేమసంఘం నాయకుడు కంచుమర్తి చినసుబ్బారావు, సాదే అంబేడ్కర్, ఆటో యూనియన్ వర్కర్లు పాల్గొని నివాళులర్పించారు. బ్రాహ్మణగూడెంలో జరిగిన కార్యక్రమంలో కొండే గంగాధర్, కొయ్యే శ్రీనివాస్, ఎల్లే ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నల్లజర్ల: నల్లజర్ల ఎస్సీ కాలనీలో అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నేటి యువతను అంబేడ్కర్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఆయన విధి విధానాల వల్ల ప్రజాస్వామ్యంలో జీవిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్మన్ ముళ్ళపూడి బాపిరాజు, రావూరి వెంకటరమణ, ఉన్నమట్ల సత్య, పిల్లి కాంతారావు, గుదే సుబ్బారావు, బొందాల శ్రీనివాసరావు, ఆలపాటి రామకృష్ణ, గుదె రాంబాబు పాల్గొన్నారు.

దేవరపల్లి: స్థానిక బీహెచ్‌ఎస్‌ఆర్ వీఎల్ఎం డిగ్రీ కాలేజీలో జరిగిన కార్యక్రమంలో అంబేడ్కర్ వర్ధంతి చిత్రపటానికి జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి సువర్ణరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ చాలా పేదకుటుంబంలో పుట్టారని, ఎన్నో అవమానాలు ఎదుర్కొని ఉన్నత విద్యను అభ్యసించారన్నారు. రాజ్యాంగ నిర్మాణంలో ఆయన కృషి మరువలేనిదన్నారు. కార్యక్రమంలో కళాశాల ఏవో డి.ఆనంద్‌ప్రసాద్, ప్రిన్సిపాల్ బీడీఎన్ కుమార్, జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ విక్రమ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

దివాన్‌చెరువు: సమసమాజ నిర్మాణ దార్శనిడు అంబేడ్కర్ అని ఆదికవి నన్నయ యూనివర్శిటీ వీసీ ఆచార్య వై.శ్రీ నివాసరావు అన్నారు. రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని శుక్రవారం పలుచోట్ల ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నన్నయ వర్శిటీ ప్రాంగణంలోని అంబేడ్కర్ విగ్రహానికి వీసీ శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, అధ్యాపకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.



నన్నయ వర్శిటీలో అంబేడ్కర్‌కు నివాళులు



చాగల్లులో అంబేడ్కర్‌కు నాయకుల నివాళులు



నిడదవోలులో అంబేడ్కర్‌కు నాయకుల నివాళులు



గజ్జరంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు



పెరవలిలో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న దృశ్యం



దేవరపల్లిలో నివాళులర్పిస్తున్న సువర్ణరాజు



నల్లజర్లలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మద్దిపాటి

కల్యాణ వైభోగమే..

» ఘనంగా శ్రీవల్లిదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం

» ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు

» గ్రామ పురవీధుల్లో స్వామి,అమ్మవార్ల ఊరేగింపు



దేవరపల్లిలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం

దేవరపల్లి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): సుబ్రహ్మణ్యేశ్వర షష్ఠి సందర్భంగా పలుచోట్ల స్వామి కల్యాణం శుక్రవారం సాయంత్రం ఘనంగా జరిగింది. దేవరపల్లిలో ముందుగా శ్రీవల్లిదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం ఆలయార్చకులు స్వామి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. తదుపరి నిరాజన మంత్రపుష్పాలు, తీర్థప్రసాదాల వితరణ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కాట్రు భీమ రాజు, ఓరుగంటి లక్ష్మీపతిరాజు, జల్లు రాంబాబు, ఏవీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

పెరవలి/ఉండ్రాజవరం: పెరవలి, ఉండ్రాజవరం మండలాల్లోని పలు గ్రామాల్లో షష్ఠి ఏర్పాట్లు పూర్తి చేశారు. మండల కేంద్రమైన ఉండ్రాజవరంతోపాటు వేలివెన్ను, దమ్మెన్ను, సూర్యారావుపాలెం, పాలంగి గ్రామాల్లో భక్తుల కోసం బారికేడ్‌లు ఏర్పాటు చేశారు. దేవాలయాల పరిశర ప్రాంతాల్లో బ్లీచింగ్ చల్లి భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండబా ఏర్పాట్లు చేశారు. ఉండ్రాజవరంలో శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి కల్యాణం, ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. చుట్టుపక్కల పలు గ్రామాల నుంచి భక్తులు ఇక్కడకు వస్తారు. శనివారం తెల్లవారుజామున 2 గంటల నుంచే భక్తులకు దర్శనానికి అనుమతిస్తారు. ఆలయం బయట సీతమ్మ అన్నదాన శిబిరం ఏర్పాటు చేసి శనివారం ఉదయం సాయంత్రం వరకు భక్తులకు అన్న ప్రసాదం అందజేస్తారని ఉత్సవ కమి టీ తెలిపింది. పెరవలి మండలంలో ని కానూరు, కా నూరు అగ్రహారం, తీపర్రు, కాకరపర్రు, పెరవలి, ముక్కామల, ఖండవల్లి గ్రామాల్లోని సుబ్రహ్మణ్య ఆలయాలు వద్ద కూడా ఏర్పాట్లు చేశారు. గోదావరి తీరం పొడవునా ఉన్న గ్రామాలకు ఎక్కువ మంది భక్తులు వస్తారు. మండల కేంద్రమైన పెరవలిలో కాలువగట్టున ఉన్న సుబ్రహ్మణ్యస్వామి ఆలయం వద్ద ఎక్కువ మంది భక్తులు వచ్చే అవకాశం ఉండడంతో ఇక్కడ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

తాళ్లపూడి: మండలంలోని ప్రక్కిలంకలోని సుబ్రహ్మణేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారికి ఏకాదశ రుద్రాభిషేకం, లక్షపత్రి పూజ, కల్యాణం చేపట్టారు. ఆలయార్చకుడు విశ్వనాథశర్మ ఆధ్వర్యంలో స్వామివారికి అభిషే కాలు, లక్షపత్రిపూజ, కల్యాణం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గోపాలపురం: మండలంలోని పలు గ్రామాల్లో శ్రీవల్లిదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఐదురోజుల పాటు నిర్వహించే ఈ ఉత్సవాలకు భక్తుల సౌకర్యార్థం చలువ పందిళ్ల ఏర్పాటు చేసినట్టు ఉత్సవ నిర్వాహకులు సుతాపల్లి రామకృష్ణ తదితరులు తెలిపారు.



ఉండ్రాజవరంలో సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం



తాళ్లపూడి: ప్రక్కిలంకలో కల్యాణంలో పాల్గొన్న దంపతులు

బాధిత కుటుంబానికి నష్ట పరిహారం అందజేత



సహచరుడికి సహాయం చేస్తున్న 2009 సివిల్ కానిస్టేబుల్స్

కొవ్వూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందిన కుటుంబానికి ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు నష్ట పరిహారం అందించారు. కొవ్వూరు మండలం ధర్మవరం గ్రామానికి చెందిన కొణతం నరసింహమూర్తి అక్టోబరు 9న పంట పొలంలో విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. మృతుడి కుటుంబానికి విద్యుత్‌శాఖ నుంచి మంజూరైన రూ.5 లక్షలు నష్ట పరిహారాన్ని శుక్రవారం మృతుడి భార్య వెంకటలక్ష్మి కొవ్వూరులోని టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో గారపాటి వెంకటకృష్ణ, వెంపాటి యుగంధర్, గారపాటి సూర్యచంద్రం, కుందుల సూర్యారావు, కలగర గంగరావు, జొన్నకూటి మధుబాబు, ట్రాన్స్‌కో ఏడీఈ కృష్ణ నాయక్, ఏఈ సీహెచ్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక సాయం

అనారోగ్యానికి గురయిన కానిస్టేబుల్ కుటుంబానికి 2009 బ్యాచ్ కానిస్టేబుల్స్ రూ.లక్ష ఆర్థికసాయం అందజేశారు. నిడదవోలు పోలీస్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న టి.రాజేష్ అనారోగ్యానికి గురయ్యాడు. రాజమహేంద్రవరంలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. 2009 బ్యాచ్ సివిల్ కానిస్టేబుల్స్ అందరూ కలసి సహాయ ఫౌండేషన్‌గా ఏర్పడి శుక్రవారం రూ.లక్ష నగదును రాజేష్ కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో సహాయ ఫౌండేషన్ సభ్యులు కిషోర్, రాజేష్, రమణ, శ్రీనివాస్, వెంకటరమణ, రామారావు, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి సాయం

దేవరపల్లి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): త్యాజంపూడి గ్రామానికి చెందిన యాదాల దిలీప్‌కుమార్ ఇటీవల ప్రమాదవశాత్తూ విద్యుత్‌షాక్‌కు గురై మరణించడంతో ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు శుక్రవారం ఆ కుటుంబాన్ని పరామర్శించి తక్షణ సాయం కింద రూ.1,10,000 ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని విధాల బెనిఫిట్స్‌ను బాధిత కుటుంబానికి అందే విధంగా కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు ఆండ్రూ అనీల్ తదితరులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి

పట్టణాభివృద్ధే లక్ష్యం

మునిసిపల్ చైర్మన్ ఆదినారాయణ

నిడదవోలు, డిసెంబరు 06 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అన్ని వార్డులను అభివృద్ధి పర్చడమే లక్ష్యంగా తమ కౌన్సిల్ పనిచేస్తోందని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అన్నారు. నిడదవోలులోని 26వ వార్డులో సిమెంటు రోడ్డు పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణంలోని రోడ్డు నిర్మాణాల నాణ్యతకు పెద్ద పీట వేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఆయన వెంట వైస్ చైర్మన్ గంగుల వెంకటలక్ష్మి, కౌన్సిలర్స్ తోలేటి ఝాన్సీ, కారింకి నాగేశ్వరరావు, జనసేన నాయకులు మద్దిపాటి ఫణీంద్ర, గంగుల గోపీయాదవ్ ఉన్నారు.

'శార్వాణి'కి ఎక్సలెన్స్ అవార్డు

గోపాలపురం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గోపాలపురంలోని శార్వాణి ఇంగ్లీష్ మీడియం స్కూల్‌కు అరుదైన గౌరవం దక్కింది. హైదరాబాదులోని బ్రేయిన్ ఫీడ్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో శార్వాణి స్కూల్ 2024-25 సంవత్సరానికి గానూ జాతీయ స్థాయి స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ అవార్డు దక్కించుకుంది. శుక్రవారం రాపాక ఫణికిషోర్ అవార్డు అందుకున్నారు.

నేడు టీచర్స్, పేరెంట్స్ పండుగ

గోపాలపురం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు మండలంలో ఆయా పాఠశాలల్లో శనివారం నిర్వహించే పేరెంట్స్, టీచర్స్ సమావేశానికి ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు సర్వం సిద్ధం చేశారు. అందులో భాగంగా పాఠశాలలను జెండాలతో అలంకరించి పాఠశాల ఆవరణ చుట్టూ పారిశుధ్య పనులు నిర్వహించారు. విద్యాశాఖ ఆదేశాల మేరకు పాఠశాలల్లో తల్లిదండ్రులకు పోటీలు నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశారు. విజేతలకు గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేయనున్నారు.

మల్లవరం మాజీ సర్పంచ్

రాజేశ్వరి మృతి

చాగల్లు, డిశంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లవరం మాజీ సర్పంచ్ కోడూరి రాజేశ్వరి అనే సరోజిని (81) శుక్రవారం మృతి చెందారు. ఆమె గతంలో మల్లవరం సర్పంచ్‌గా పనిచేసారు. ఆమె భర్త కోడూరి రంగారావు మండల టీడీపీ అధ్యక్షుడుగా పనిచేసారు. వీరు గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేసి మంచి గుర్తింపు పొందారు. ఆమెకు ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. వారి కోడలు లక్ష్మీసుభాషిణి సర్పంచ్‌గాను, కుమారుడు కోడూరి కాశి గంగాధరరావు ఉపసర్పంచ్‌గాను ఎన్నికై ప్రజాప్రతినిధులుగా పనిచేస్తున్నారు. రాజేశ్వరి అంతిమ యాత్రలో అధిక సంఖ్యలో గ్రామ ప్రజలు, టీడీపీ అభిమానులు పాల్గొని ఆమె నివాళి అర్పించారు.